
# ప్రజాస్వరం
PRAJASWARAM
తెలుగు దినపత్రిక

MHR TV

మెదక్ | సంపుటి: 19 సంచిక : 41 | ఆదివారం 12, అక్టోబర్ 2025 | పేజీలు: 08 వెల: రూ.1

Circulated By: Hyderabad-Medak-Sangareddy-Nalgonda-Warangal-Nizamada-Vijayawada-Guntur-Vizag Adilabad Kurnool | www.prajaswaramdaily.com

## జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక ప్రతీ పైసా
# లెక్క చెప్పాల్సిందే!

**జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక ఖర్చులపై ఈసీ దృష్టి**
**టీ, టిఫిన్ల నుంచి ఫంక్షన్ హాళ్ల వరకు ధరల ఖరారు**
**అభ్యర్థులు రోజువారీ ఖర్చుల వివరాలు సమర్పించాలని ఆదేశం**
**నిబంధనలు మీరితే కఠిన చర్యలు తప్పవని అధికారుల హెచ్చరిక**

**తెలంగాణ బ్యూరో, ప్రజాస్వరం :**

జూబ్లీహిల్స్ నియోజకవర్గ ఉప ఎన్నిక ప్రచారంలో అభ్యర్థులు చేసే ఖర్చుపై ఎన్నికల సంఘం పూర్తిస్థాయిలో దృష్టి సారించింది. అభ్యర్థుల వ్యయాలకు కళ్లెం వేసేందుకు, పారదర్శకతను పెంచేందుకు అధికారులు కీలక చర్యలు చేపట్టారు. ప్రచారంలో భాగంగా పెట్టే ప్రతి ఖర్చుకూ అధికారికంగా ధరలను నిర్ణయిస్తూ శుక్రవారం ఒక జాబితాను విడుదల చేశారు. ఇకపై అభ్యర్థులు తాము అందించే ఒక కప్పు టీ నుంచి నిర్వహించే పెద్ద సభల వరకు ప్రతీ పైసాకు లెక్క చెప్పాల్సిందే.

ఎన్నికల ప్రవర్తనా నియమావళి ప్రకారం అభ్యర్థులు తమ రోజువారీ ఖర్చుల వివరాలను తప్పనిసరిగా సమర్పించాలని అధికారులు స్పష్టం చేశారు. ఈ నిబంధనలను ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. అభ్యర్థులు తమ ఖర్చులను తక్కువ చేసి చూపకుండా నిరోధించేందుకే ఈ ధరల పట్టికను రూపొందించినట్లు తెలిపారు.

**ఆహారం నుంచి ఫంక్షన్ హాళ్ల వరకు**

అధికారులు ప్రకటించిన ధరల జాబితా ప్రకారం.. ఒక సింగిల్ టీ ధర రూ.5, పెద్ద కప్పు టీ రూ.10గా నిర్ణయించారు. అదేవిధంగా, ప్లేట్ ఇడ్లీ (నాలుగు) రూ.20, ఒక ఆలూ సమోసా రూ.10గా ఖరారు చేశారు. ఇక భోజనాల విషయానికొస్తే,

..మిగతా 2లో

# 50 శాతంతో ఓకే!

## 'స్థానిక' పోరుపై రాష్ట్ర ఎన్నికల సంఘానికి హైకోర్టు సూచన
## ప్రభుత్వం జారీ చేసిన జీవోలు 9, 41, 42 నిలిపివేత

సర్కార్ ఉత్తర్వులు సుప్రీంకోర్టు తీర్పులకు విరుద్ధం
మొత్తం రిజర్వేషన్లు 50 శాతానికి మించడానికి వీలులేదు
పూర్తి స్థాయిలో మెరిట్స్‌లోకి ఇప్పుడే వెళ్లడం లేదన్న న్యాయస్థానం
పెంచిన 17%సీట్లను ఓపెన్ కేటగిరీగా పేర్కొని ఎన్నికలు నిర్వహించుకోవచ్చని సూచన

**తెలంగాణ బ్యూరో, ప్రజాస్వరం :**

బీసీ రిజర్వేషన్లను పెంచుతూ రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన జీవో 9ని హైకోర్టు సీజే ధర్మాసనం నిలిపివేసింది. దీంతో పాటు మండల ప్రజా పరిషత్, జిల్లా ప్రజా పరిషత్, గ్రామ పంచాయతీ ఎన్నికలు సంబంధించి పంచాయతీ రాజ్ చట్టం-2018లో రిజర్వేషన్లను మారుస్తూ సెప్టెంబర్ 26న జారీ చేసిన జీవో నంబర్ 41, 42పై కూడా స్టే విధించింది. ప్రస్తుతానికి తాము పూర్తిస్థాయిలో మెరిట్స్‌లోకి వెళ్లడం లేదని తెలిపింది.

వికాస్ కిషన్‌రావ్ గవాలీ కేసులో సుప్రీంకోర్టు రిజర్వేషన్లు 50 శాతానికి మించవద్దని నిర్దేశించిందని, దీన్ని పాటించడంలో రాష్ట్ర ప్రభుత్వం విఫలమైందని వ్యాఖ్యానించింది. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ ఇచ్చిన జీవోలను ఈ కోర్టు నిలిపివేసినందున, రాష్ట్ర ఎన్నికల సంఘం పెంచిన 17 శాతం సీట్లను ఓపెన్ కేటగిరీ సీట్లుగా నోటిఫై చేసి స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించవచ్చని తేల్చిచెప్పింది. ఈ మేరకు శుక్రవారం అర్ధరాత్రి తీర్పు కాపీని విడుదల చేసింది.

**ఓపెన్ కేటగిరీగా నోటిఫై చేయండి..**

ఎన్నికల నోటిఫికేషన్ వెలువడినందున ప్రక్రియలో జోక్యం చేసుకోవద్దన్న వాదనలు తమ ముందుకు వచ్చాయని..

..మిగతా 2లో






### కులం పేరు చెప్పుకుని రాలేదు.. జనం మధ్య నుంచే వచ్చా

టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి ఆసక్తికర వ్యాఖ్యలు
వచ్చే ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ మళ్లీ అధికారంలోకి రాదు
మరలా అధికారంలోకి వచ్చేది కాంగ్రెస్ ప్రభుత్వమే

02




### అసెంబ్లీలో ఒకమాట.. బయట మరో మాట

బీజేపీ, బీఆర్ఎస్‌లపై కూనంనేని ఫైర్
బీసీ రిజర్వేషన్లపై హైకోర్టు స్టే విధించడంపై కూనంనేని వ్యాఖ్యలు
బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలు సంబరాలు చేసుకుంటున్నాయని తీవ్ర విమర్శ
ప్రభుత్వంపై ద్వేషమా? లేక బీసీలపై ప్రేమ లేదా? అని నిలదీత

02



### భగ్గుమన్న బీసీ సంఘాలు.. 14న తెలంగాణ బంద్

స్థానిక సంస్థల్లో 42 శాతం బీసీ రిజర్వేషన్లపై హైకోర్టు స్టే
నిరసనగా 14న రాష్ట్ర బంద్‌కు పిలుపునిచ్చిన ఆర్. కృష్ణయ్య
13న జాతీయ రహదారుల దిగ్బంధానికి జాజుల శ్రీనివాస్ పిలుపు
హైకోర్టు తీర్పు ఏకపక్షమంటూ బీసీ నేతల తీవ్ర విమర్శ



### అక్రమ కేసులు పెట్టారంటూ డీజీపీకి రాజాసింగ్ లేఖ

మధ్యప్రదేశ్ ప్రసంగాన్ని వక్రీకరించారని ఫిర్యాదు
హైదరాబాద్‌లోని 31 పోలీస్ స్టేషన్లలో కేసులు ఉన్నాయని వెల్లడి
హైదరాబాద్‌కు సంబంధం లేకుండా కేసులెలా పెడతారని ప్రశ్న

03

# రేవంత్.. పులి కాదు.. పిల్లి!

**ఆలమట్టి డ్యాం ఎత్తు పెంపుపై సీఎం మౌనం వహించడంపై తీవ్ర విమర్శ**
**కర్ణాటకకు వెళ్లినా కృష్ణా జలాల గురించి మాట్లాడలేదని ఆరోపణ**
**ఢిల్లీకి బ్యాగులు మోయడమే రేవంత్ పని అంటూ సెటైర్**
**పొరుగు రాష్ట్రాలు నీళ్లు ఆపుకుంటే మన పరిస్థితి ఏంటని ప్రశ్న**



**తెలంగాణ బ్యూరో, ప్రజాస్వరం :**

సీఎం రేవంత్ రెడ్డిపై మాజీ మంత్రి, బీఆర్ఎస్ నేత హరీశ్ రావు తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. "రేవంత్ రెడ్డి నల్లమల పులి కాదు... నల్లమల పిల్లి" అని ఆయన ఘాటుగా విమర్శించారు. పొరుగు రాష్ట్రాలు

..మిగతా 2లో

## ఉద్యోగాలు వెతికేవారుగా కాకుండా ఉద్యోగాలు ఇచ్చేవారుగా
# యువత ఉండాలి

**కోయంబత్తూరులో ఎఫ్ఎంఏఈ కార్యక్రమానికి అతిథిగా హాజరైన కేటీఆర్**
**అవకాశాల కోసం ఎదురుచూడకుండా మీరే సృష్టించుకోవాలని యువతకు పిలుపు**
**పెద్ద కలలు కనడం ప్రారంభించిన తర్వాత మీ సామర్థ్యాన్ని చూసి మీరే ఆశ్చర్యపోతారని వ్యాఖ్య**
**తెలంగాణ రాష్ట్ర సాధన ప్రయాణాన్ని గుర్తుచేసిన కేటీఆర్**



**హైదరాబాద్, ప్రజాస్వరం :**

ఉద్యోగులు వెతికేవారుగా కాకుండా, ఉద్యోగాలు ఇచ్చేవారుగా నేటి యువత ఉండాలని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. కోయంబత్తూరులో జరిగిన 10వ ఎఫ్ఎంఏఈ నేషనల్ స్టూడెంట్ మోటార్‌స్పోర్ట్స్ 2025కి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ, అవకాశాల కోసం ఎదురు చూడకుండా మీరే సృష్టించుకోవాలని పిలుపునిచ్చారు. పెద్ద కలలు కనడం ప్రారంభించిన తర్వాత మీ సొంత సామర్థ్యాన్ని చూసి మీరే ఆశ్చర్యపోతారని ఆయన అన్నారు.ఈ సందర్భంగా తెలంగాణ రాష్ట్ర సాధన ప్రయాణాన్ని కేటీఆర్ గుర్తు చేశారు. ఒకప్పుడు

..మిగతా 2లో

# నా శాఖలో ఆయన జోక్యమేంటి?..

**పొంగులేటిపై కొండా సురేఖ ఫైర్**
**మేడారం టెండర్ల విషయంలో మంత్రులు పొంగులేటి, కొండా సురేఖ మధ్య విభేదాలు**
**మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డిపై సీఎం రేవంత్‌కు కొండా సురేఖ ఫిర్యాదు**
**రూ.71 కోట్ల టెండర్‌ను తన అనుచరుడికి ఇప్పించేందుకు పొంగులేటి ప్రయత్నం అని ఆరోపణ**



**తెలంగాణ బ్యూరో, ప్రజాస్వరం :**

తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వంలో ఇద్దరు మంత్రుల మధ్య విభేదాలు బహిర్గతమయ్యాయి. ప్రతిష్ఠాత్మక మేడారం ఆలయ అభివృద్ధి పనులకు సంబంధించిన టెండర్ల విషయంలో మంత్రులు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, కొండా సురేఖ మధ్య వివాదం తలెత్తింది. ఈ వ్యవహారంలో మంత్రి పొంగులేటి తన

..మిగతా 2లో

# అంతా చొరబాట్ల వల్లే..

దేశంలో కొన్ని ప్రాంతాల్లో జనాభా మార్పులకు చొరబాట్లే కారణమన్న అమిత్ షా
కొన్ని పార్టీలు చొరబాటుదారులను ఓటు బ్యాంకుగా వాడుకుంటున్నాయని ఆరోపణ
అసోం, పశ్చిమ బెంగాల్‌లో ముస్లిం జనాభా అసాధారణ వృద్ధి అని వెల్లడి
చొరబాట్లు దేశ భద్రతకు, ప్రజాస్వామ్యానికి పెను ముప్పుగా అభివర్ణన
సరిహద్దు భద్రతలో రాష్ట్ర ప్రభుత్వాల సహకారం తప్పనిసరి అని స్పష్టీకరణ



03

# 50 శాతంతో ఓకే!



మొదటిపేజీ తరువాయి

వాదనలు ప్రాథమిక దశలోనే ఉన్నందున.. గతంలో రాహుల్ రమేశ్‌వాఘ్ కేసులో సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పుపై ఆధారపడుతున్నామని చెప్పింది. రాష్ట్రం లేదా కేంద్రపాలిత ప్రాంతం ట్రిపుల్ టెస్ట్‌ను పాటించపోతే, స్థానిక సంస్థల ఎన్నికలను వాయిదా వేసే పరిస్థితి లేకుండా, పెంచిన దామాషా సీట్లను ఓపెన్ కేటగిరీ సీట్లుగా నోటిఫై చేసి ఎన్నికలు నిర్వహించాలని ఈసీకి సూచించింది. ఎన్నికల ప్రక్రియలో జోక్యం చేసుకోవాలని, స్థానిక ఎన్నికల ప్రక్రియను నిలిపివేయాలని ఈ కోర్టు భావించడం లేదని చెప్పింది. రిజర్వేషన్ల పెంపు జీవోను నిలిపివేసినందున ఆ మేరకు మార్పు మాత్రమే సూచిస్తున్నామని స్పష్టం చేసింది.

బీసీలకు 42% కోటా జీవోపై హైకోర్టు స్టే విధించడంతో మున్ముందు ఏం జరుగుతుందోనన్న చర్చ రాష్ట్ర రాజకీయ వర్గాల్లో జరుగుతోంది. అసలు రాష్ట్రంలోని స్థానిక సంస్థలకు ఎన్నికలు జరుగుతాయా లేదా? జరిగితే ఎప్పుడు, ఎలా జరుగుతాయి? ప్రభుత్వం ఎలా ముందుకెళ్తుందన్నది అసక్తికరంగా మారింది. హైకోర్టు తీర్పు నేపథ్యంలో ఎలా ముందు కెళ్లాలనేదానిపై ప్రభుత్వం కూడా మల్లగుల్లాలు పడుతున్నట్లు తెలుస్తోంది. స్థానిక సంస్థల్లో బీసీ రిజర్వేషన్లను 42 శాతానికి పెంచుతూ ప్రభుత్వం ఇచ్చిన జీవోపై హైకోర్టు స్టే ఇవ్వడంతో పరిస్థితి మళ్లీ మొదటికి వచ్చినట్టు అటు రాజకీయ వర్గాలు, ఇటు బీసీ సంఘాలు భావిస్తున్నాయి. హైకోర్టు ఇచ్చిన తీర్పుపై రాష్ట్ర ప్రభుత్వం సుప్రీంకోర్టును ఆశ్రయిస్తుందా లేదా అన్న దానిపై కూడా భిన్న వాదనలు వినిపిస్తున్నాయి. హైకోర్టు తీర్పు దరిమిలా ఏం చేయాలన్న దానిపై రాష్ట్ర ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి న్యాయ నిపుణులు, రాష్ట్ర ప్రభుత్వ ఉన్నతాధికారులతో సంప్రదింపులు జరుపుతున్నారని, సుప్రీం కోర్టులో స్పెషల్ లీవ్ పిటిషన్ (ఎస్ఎల్‌పీ) దాఖలు చేయాలా వద్దా అన్న అంశంపై చర్చలు జరుగుతున్నాయనే సమాచారం అందుతోంది. బిహార్ అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో జాతీయ, రాష్ట్ర రాజకీయాలను ప్రభావితం చేయగలిగే ఈ అంశంపై పకడ్బందీగా ముందుకు వెళ్లడంపై న్యాయ నిపుణులతో సీఎం చర్చలు జరుపుతున్నట్టుగా తెలుస్తోంది. అసలు హైకోర్టు ఏం తీర్పు ఇచ్చిందనేది కూడా శుక్రవారం అర్ధరాత్రికి స్పష్టత రావడంతో, ఆయా అంశాలను పరిగణనలోకి తీసుకుని ముందుకు వెళ్లడంపై ప్రభుత్వ వర్గాలు దృష్టి సారించనున్నాయి. ఈ మేరకు న్యాయ నిపుణులతో సంప్రదింపులు జరిపే అవకాశం ఉందని అంటున్నారు.

**రెండే ప్రత్యామ్నాయాలు?**

రాష్ట్ర ప్రభుత్వం ముందు రెండే ప్రత్యామ్నాయాలున్నాయని రాజకీయ నిపుణులు పేర్కొంటున్నారు. హైకోర్టు స్టేపై సుప్రీంకోర్టును ఆశ్రయించడం ఒకటి కాగా.. జీవో అమలుపై స్టే విధించిన నేపథ్యంలో హైకోర్టు సూచనలకు అనుగుణంగా ఆరు వారాల పాటు వేచి ఉండటం రెండో ప్రత్యామ్నాయమని చెబుతున్నారు. ఆ సమయానికి రాష్ట్రపతి, గవర్నర్లకు పంపిన బిల్లులకు కూడా మూడు నెలల సమయం పూర్తవుతుందని, అప్పుడు అటు సుప్రీంకోర్టు, ఇటు హైకోర్టులో బలమైన వాదనలు వినిపించి బీసీ రిజర్వేషన్ల జీవోకు అనుకూల నిర్ణయాన్ని కోర్టుల నుంచి ఆశించేందుకు అవకాశం ఉంటుందని వారంటున్నారు.


**ప్రతిపక్షాలకు అస్త్రంగా..**

హైకోర్టు స్టే నేపథ్యంలో అధికార కాంగ్రెస్ పార్టీని ఈ విషయంలో ఇరుకున పెట్టే వ్యూహంతో ప్రతిపక్ష పార్టీలు ముందుకెళుతున్నాయి. బీసీ రిజర్వేషన్ల పెంపుదల అంశం న్యాయ సమీక్షకు వెళ్తుందని తెలిసినా, కనీస జాగ్రత్తలు తీసుకోకుండా ప్రభుత్వం ఉదాసీనంగా వ్యవహరించిందని ప్రధాన రాజకీయ పార్టీల నేతలు విమర్శిస్తున్నారు. హైకోర్టు స్టే విధించడానికి పూర్తి బాధ్యత కాంగ్రెస్ ప్రభుత్వం, సీఎం రేవంత్‌రెడ్డిదేనని ఇప్పటికే బీజేపీ, బీఆర్ఎస్ నేతలు మండిపడుతున్నారు.రిజర్వేషన్ల అంశం రాజ్యాంగపరమైన, శాస్త్రీయమైన ప్రక్రియతోనే సాధ్యమని తెలిసీ, కాంగ్రెస్ పార్టీ దానిని పూర్తిగా అపహాస్యం చేసిందని బీజేపీ ఓబీసీ మోర్చా జాతీయ అధ్యక్షుడు డాక్టర్ కె.లక్ష్మణ్ ధ్వజమెత్తారు. మరోవైపు బీఆర్ఎస్‌కు చెందిన బీసీ నేతలు కూడా కాంగ్రెస్ పార్టీ వైఖరిని తప్పు పడుతున్నారు. మాజీ మంత్రులు గంగుల కమలాకర్, వి.శ్రీనివాస్‌గౌడ్ తదితరులు.. రాష్ట్ర ప్రభుత్వానికి బీసీ వర్గాలకు రిజర్వేషన్లు అమలు చేయాలన్న చిత్తశుద్ధి లేదని ఆరోపించారు. అదే సమయంలో కాంగ్రెస్ పార్టీ.. వీరి విమర్శలను తిప్పికొట్టే ప్రయత్నం చేస్తోంది.తమకు చిత్తశుద్ధి లేకపోతే అసలు ఇంత దూరం ఎందుకు తీసుకువస్తామని ఆ పార్టీ నేతలు ప్రశ్నిస్తున్నారు. అసెంబ్లీలో మద్దతిచ్చిన బీఆర్ఎస్ కోర్టు కేసులో ఇంప్లీడ్ కాకపోవడాన్ని తప్పు పడుతున్నారు. రాష్ట్రపతి, గవర్నర్‌ల వద్ద ఉన్న బిల్లులను ఆమోదింపజేస్తే అసలు కోర్టులకు వెళ్లాల్సిన అవసరమే రాదని, ఈ విషయంలో బీజేపీ నేతలు బీసీలను మోసం చేస్తున్నారని ఆరోపిస్తున్నారు. మొత్తం మీద హైకోర్టు స్టే రాష్ట్రంలో రాజకీయ వేడిని రగులుస్తుండగా.. ప్రభుత్వం ఎలా ముందుకెళ్తుందనే అంశం ఆసక్తికరంగా మారింది.

**కింకర్తవ్యం..!?**

- జీవో నంబర్ 9పై హైకోర్టు స్టే నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం మల్లగుల్లాలు
- న్యాయ నిపుణులు, ఉన్నతాధికారులతో సీఎం రేవంత్ సంప్రదింపులు
- అధికార, ప్రతిపక్షాల పరస్పర విమర్శలు.. రాజుకుంటున్న రాజకీయ వేడి

## అసెంబ్లీలో ఒక మాట.. బయట మరో మాట



- బీజేపీ, బీఆర్ఎస్‌లపై కూనంనేని ఫైర్
- బీసీ రిజర్వేషన్లపై హైకోర్టు స్టే విధించడంపై కూనంనేని వ్యాఖ్యలు
- బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలు సంబరాలు చేసుకుంటున్నాయని తీవ్ర విమర్శ
- ప్రభుత్వంపై ద్వేషమా? లేక బీసీలపై ప్రేమ లేదా? అని నిలదీత

హైదరాబాద్, ప్రజాస్వరం :

బీసీ రిజర్వేషన్ల అంశంపై హైకోర్టు ఇచ్చిన స్టే పట్ల బీజేపీ, బీఆర్ఎస్ ఆనందం వ్యక్తం చేస్తున్నాయని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు తీవ్ర ఆరోపణలు చేశారు. ఈ రెండు పార్టీలకు బీసీల పట్ల ఏమాత్రం ప్రేమ లేదని, అందుకే కోర్టు తీర్పును ఒక పండుగలా జరుపుకుంటున్నాయని ఆయన విమర్శించారు. హైదరాబాద్‌లో శనివారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. బీసీ రిజర్వేషన్ల బిల్లును శాసనసభలో ఏకగ్రీవంగా ఆమోదించినప్పుడు మద్దతు పలికిన ఈ పార్టీలు, ఇప్పుడు బయటకొచ్చి వ్యతిరేకించడం వారి ద్వంద్వ వైఖరికి నిదర్శనమని అన్నారు. ప్రభుత్వంపై ఉన్న ద్వేషంతో బీసీలకు అన్యాయం చేస్తున్నారా? లేక నిజంగానే వారికి బీసీలంటే ప్రేమ లేదా? అని కూనంనేని ప్రశ్నించారు. రిజర్వేషన్లు 50 శాతం మించరాదన్న సుప్రీంకోర్టు తీర్పు ఉందని, అయితే తమిళనాడులో రాజ్యాంగంలోని 9వ షెడ్యూల్‌లో చేర్చడం ద్వారా ఆ పరిమితిని అధిగమించారని కూనంనేని గుర్తుచేశారు. రాజ్యాంగ సవరణ చేసే అధికారం కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వానికి ఉన్నప్పటికీ, బీసీలకు న్యాయం చేసేందుకు ముందుకు రావడం లేదని ఆయన విమర్శించారు. ఈ మొత్తం వ్యవహారంలో బీజేపీయే ప్రధాన దోషి అని ఆయన స్పష్టం చేశారు. బీసీలకు న్యాయం జరిగే వరకు తమ పార్టీ పోరాడుతుందని, అందుకే ఈ కేసులో సీపీఐ ఇంప్లీడ్ అయిందని సాంబశివరావు తెలిపారు. బీసీ రిజర్వేషన్లకు అడ్డుపడుతున్న బీజేపీకి బీఆర్ఎస్ వంత పాడుతోందని ఆయన ఆరోపించారు.

## నా శాఖలో ఆయన జోక్యమేంటి?..



మొదటిపేజీ తరువాయి

శాఖలో జోక్యం చేసుకుంటున్నారంటూ దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ఫిర్యాదు చేయడం రాజకీయంగా కలకలం రేపుతోంది. వివరాల్లోకి వెళితే, దేవాదాయ శాఖ ఆధ్వర్యంలో జరుగుతున్న సుమారు రూ.71 కోట్ల విలువైన మేడారం అభివృద్ధి పనుల టెండర్‌ను తన అనుచరుడికి కట్టబెట్టేందుకు పొంగులేటి ప్రయత్నిస్తున్నారని కొండా సురేఖ ఆరోపించారు. తన శాఖ పరిధిలోని విషయాల్లో ఇన్‌చార్జ్ మంత్రి హోదాలో పొంగులేటి జోక్యం చేసుకోవడంపై ఆమె తీవ్ర అసంతృప్తితో ఉన్నట్టు సమాచారం. ఈ అంశంపై ఆగ్రహం వ్యక్తం చేసిన ఆమె, విషయాన్ని నేరుగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. అంతేకాదు, కాంగ్రెస్ పార్టీ అధిష్ఠానానికి కూడా పొంగులేటిపై ఫిర్యాదు చేసినట్లు తెలిసింది. ఇద్దరు సీనియర్ మంత్రుల మధ్య తలెత్తిన ఈ వివాదంపై అధిష్ఠానం ఎలా స్పందిస్తుందోనని పార్టీ వర్గాల్లో ఉత్కంఠ నెలకొంది.

రాబోయే మేడారం జాతరను దృష్టిలో ఉంచుకుని, ఆలయ అభివృద్ధి పనులను రేవంత్ రెడ్డి ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా తీసుకుంది. ఇటీవల ముఖ్యమంత్రి స్వయంగా మేడారం సందర్శించి, పనులను త్వరగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఇలాంటి కీలక సమయంలో ఇద్దరు మంత్రుల మధ్య టెండర్ల వివాదం తెరపైకి రావడం పార్టీలో చర్చనీయాంశంగా మారింది.

## కులం పేరు చెప్పుకుని రాలేదు.. జనం మధ్య నుంచే వచ్చా



- టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి ఆసక్తికర వ్యాఖ్యలు
- వచ్చే ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ మళ్లీ అధికారంలోకి రాదు
- మరలా అధికారంలోకి వచ్చేది కాంగ్రెస్ ప్రభుత్వమే

హైదరాబాద్, ప్రజాస్వరం :

కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత, టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. వచ్చే ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ మళ్లీ అధికారంలోకి రాదని, మరలా అధికారంలోకి వచ్చేది కాంగ్రెస్ ప్రభుత్వమే అని అన్నారు. పాలనాపరంగా కాంగ్రెస్, బీఆర్ఎస్ మధ్య ఎంతో వ్యత్యాసం ఉందన్నారు. బీఆర్ఎస్ నేతలు ఏనాడూ సచివాలయానికి రాలేదని, కేవలం వారి ఇళ్ల నుంచే పరిపాలన కొనసాగించారని విమర్శించారు. సంగారెడ్డి జిల్లాలో నిర్వహించిన మీడియా సమావేశంలో జగ్గారెడ్డి మాట్లాడారు.

సదాశివ పేట పట్టణంలోని కందకం రోడ్డు పనులపై ఆర్ అండ్ బీ, మున్సిపల్ అధికారులతో జగ్గారెడ్డి సమీక్ష నిర్వహించారు. 'సదాశివ పేట పట్టణంలోని కందకం రోడ్డుకు నేను ఉమ్మడి రాష్ట్రంలో సీఎం కిరణ్ కుమార్ రెడ్డి, మున్సిపల్ మంత్రి మహీధర్ రెడ్డిల సహకారంతో 2014లో రూ.20 కోట్లు మంజూరు చేయించా. 2014లో నిధులు మంజూరైతే 11 ఏళ్ల పాటు ఎందుకు పనులు పూర్తి చేయలేక పోయారు. 11 ఏళ్ల తర్వాత మళ్లీ నేనే రివ్యూ చేయాల్సి వస్తుందంటే.. సదాశివ పేట ప్రజలు ఆలోచించాలి. ఉమ్మడి రాష్ట్రంలో 20 కోట్లు మంజూరైతే..11 సంవత్సరాలలో 15 కోట్లు ఖర్చు చేశారు. పనులు ఇప్పటికీ పూర్తి చేయలేక పోయారు. ఇంకా 5 కోట్లు పనులు మిగిలి ఉన్నాయి' అని జగ్గారెడ్డి ఫైర్ అయ్యారు.'నా రివ్యూలకు వచ్చే అధికారులు భయపడాల్సిన అవసరం లేదు. మీపై ఆఫీసర్లు ఎవరైనా ఏమైనా అంటే నా పేరు చెప్పిండి. గెలుపు, ఓటమి నన్ను ప్రభావితం చేయలేవు. నా రాజకీయ ప్రయాణం కష్టాలతో కూడుకున్నది. రాత్రుళ్లు జెండాలు కట్టి.. పగటి పూట ధర్నాలు చేసి ఎదిగిన చరిత్ర నాది. నేను కులం పేరు చెప్పుకొని రాజకీయాల్లోకి రాలేదు.. జనం మధ్య నుంచే వచ్చాను' అని టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి చెప్పుకొచ్చారు.

## భగ్గుమన్న బీసీ సంఘాలు.. 14న తెలంగాణ బంద్




- స్థానిక సంస్థల్లో 42 శాతం బీసీ రిజర్వేషన్లపై హైకోర్టు స్టే
- నిరసనగా 14న రాష్ట్ర బంద్‌కు పిలుపునిచ్చిన ఆర్. కృష్ణయ్య
- 13న జాతీయ రహదారుల దిగ్బంధానికి జాజుల శ్రీనివాస్ పిలుపు
- హైకోర్టు తీర్పు ఏకపక్షమంటూ బీసీ నేతల తీవ్ర విమర్శ

హైదరాబాద్, ప్రజాస్వరం :

స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు కేటాయించిన 42 శాతం రిజర్వేషన్లపై హైకోర్టు స్టే విధించడాన్ని నిరసిస్తూ బీసీ సంఘాలు ఆందోళనలకు పిలుపునిచ్చాయి. 14న రాష్ట్రవ్యాప్త బంద్ నిర్వహించనున్నట్లు ఎంపీ ఆర్. కృష్ణయ్య ప్రకటించగా, 13న జాతీయ రహదారులను దిగ్బంధం చేయనున్నట్లు జాజుల శ్రీనివాస్ గౌడ్ తెలిపారు. హైకోర్టు నిర్ణయంపై బీసీ సంఘాల నేతలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. హైదరాబాద్‌లోని బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో 22 బీసీ సంఘాలతో జరిగిన సమావేశంలో ఆర్. కృష్ణయ్య ఈ నిర్ణయాన్ని వెల్లడించారు. ఎన్నికల నోటిఫికేషన్ విడుదలయ్యాక హైకోర్టు ఏకపక్షంగా స్టే ఇవ్వడం దారుణమని ఆయన విమర్శించారు. బీసీ రిజర్వేషన్ల సాధన ఇప్పుడు ఒక ప్రజా ఉద్యమంగా మారిందని, మిలియన్ మార్చ్ తరహాలో శాంతియుతంగా ఉద్యమిస్తామని ఆయన స్పష్టం చేశారు. ఈ బంద్‌కు అన్ని రాజకీయ పార్టీలు మద్దతు ఇవ్వాలని కోరారు.ఈ సమావేశంలో పాల్గొన్న ఎమ్మెల్సీ మధుసూదనాచారి మాట్లాడుతూ "బీసీలు బిచ్చగాళ్లు కాదు, వాటాదారులు అనే వాస్తవాన్ని పాలకులు గ్రహించాలి. రాజ్యాధికారంతోనే బీసీల సమస్యలు పరిష్కారమవుతాయి" అని అన్నారు. 42 శాతం రిజర్వేషన్లు అమలు చేశాకే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ డిమాండ్ చేశారు. మరోవైపు, బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ హైకోర్టు స్టేకు నిరసనగా 13న రాష్ట్రవ్యాప్తంగా జాతీయ రహదారులను దిగ్బంధం చేయాలని నిర్ణయించినట్లు తెలిపారు. ఉద్యమాన్ని మరింత ఉద్ధృతం చేస్తామని హెచ్చరించారు. నేటి మధ్యాహ్నం బంజారాహిల్స్‌లోని కళింగభవన్‌లో అఖిలపక్ష పార్టీలు, వివిధ సంఘాల నేతలు, మేధావులతో విస్తృతస్థాయి సమావేశం నిర్వహించనున్నట్లు ఆయన వెల్లడించారు.

## మెట్రోలో ప్రయాణించిన ఎమ్మెల్సీ



సంగారెడ్డి జిల్లా అక్టోబర్ 11(ప్రజాస్వరం):

మెట్రోలో ఎమ్మెల్సీ డా. చిన్నమైల్ అంజిరెడ్డి ప్రయాణించారు. మియాపూర్ మెట్రో స్టేషన్ నుంచి నాంపల్లి మెట్రో స్టేషన్ వరకు ఎమ్మెల్సీ ప్రయాణించారు. అనంతరం నాంపల్లి బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో పార్టీ కార్యక్రమం లో పాల్గొన్నారు. ప్రతి రోజు ఎక్కువ సమయం వరకు మెట్రో రైలు నడపడంతో పాటు వచ్చే ప్రయాణికులకు మెరుగైన ఏర్పాట్లు చేయాలని ఎమ్మెల్సీ సూచించారు. ఈ మేరకు మెట్రోలో ప్రయాణం చేస్తూ ప్రయాణికులతో మాట్లాడి మెట్రో సేవలపై సౌకర్యాలను ఎమ్మెల్సీ అడిగి తెలుసుకున్నారు. ప్రజలతో మమేకమైన వారితో మెట్రోలో కాసేపు సరదాగా గడిపారు. పిల్లల మధ్యలో కూర్చొని వారితో ముచ్చటించారు. అనంతరం ప్రజల సూచనలు ఎప్పటికీ అప్పుడు తెలుసుకోవాలని మెట్రో అఫిషియల్‌కి సూచించారు. ప్రధాని మోదీ చొరవతో హైదరాబాద్ లో చాలా ప్రాంతాలకు మెట్రో సేవలు అందుతున్నాయి. దింతో ప్రయాణికులకు సులభంగా, తక్కువ టైంలో మెరుగైన సేవలు అందుతున్నాయన్నారు.

## రేవంత్.. పులి కాదు.. పిల్లి!



మొదటిపేజీ తరువాయి

కృష్ణా, గోదావరి జలాలను తరలించుకుపోతుంటే తెలంగాణ ప్రయోజనాలను కాపాడటంలో సీఎం పూర్తిగా విఫలమయ్యారని ఆరోపించారు. శనివారం నాడు తెలంగాణ భవన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో హరీశ్ రావు మాట్లాడారు.

కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేను పరామర్శించేందుకు ఇటీవల కర్ణాటకకు వెళ్లిన రేవంత్ రెడ్డి, అక్కడి ముఖ్యమంత్రి సిద్ధరామయ్య, ఉప ముఖ్యమంత్రి శివకుమార్‌తో ఆలమట్టి డ్యాం ఎత్తు పెంపు అంశంపై ఎందుకు మాట్లాడలేదని హరీశ్ రావు నిలదీశారు. "ఆలమట్టి డ్యాం ఎత్తు పెంచితే తెలంగాణ ఎడారిగా మారుతుందన్న కనీస సోయి రేవంత్ రెడ్డికి లేదు. సొంత పార్టీ అధికారంలో ఉన్న కర్ణాటక ప్రభుత్వంతో రాహుల్ గాంధీ ద్వారా ఒక్క ఫోన్ కూడా చేయించలేని స్థితిలో ఆయన ఉన్నారు" అని విమర్శించారు. ఢిల్లీకి బ్యాగులు మోయడమే కాకుండా, రాష్ట్ర బాగోగులను కూడా పట్టించుకోవాలని హితవు పలికారు.

పొరుగు రాష్ట్రాల నీటి వినియోగంపై హరీశ్ రావు ఆందోళన వ్యక్తం చేశారు. "ఏపీ 463 టీఎంసీలు, కర్ణాటక 112 టీఎంసీలు, మహారాష్ట్ర 74 టీఎంసీల నీటిని ఆపుకుంటే మన పరిస్థితి ఏంటి? కింద గోదావరి, పైన కృష్ణా నీళ్లు వాళ్లు తీసుకుపోతే మన బతుకులు ఏం కావాలి?" అని ఆయన ప్రశ్నించారు. తరచూ తనను తాను 'నల్లమల బిడ్డ' అని చెప్పుకునే రేవంత్ రెడ్డి, నల్లమలను ఆనుకుని ప్రవహించే కృష్ణా నదికి, మహబూబ్ నగర్ జిల్లాకు నష్టం జరుగుతుంటే ఎందుకు స్పందించడం లేదని హరీశ్ రావు మండిపడ్డారు. "నువ్వు నల్లమల పులివా, పిల్లివా, ఎలుకవా? పులి అయితే గర్జించేవాడివి. పిల్లివి, ఎలుకవు కాబట్టే మౌనంగా ఉన్నావు" అంటూ తీవ్ర పదజాలంతో విమర్శలు గుప్పించారు.

## జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక ప్రతీ పైసా లెక్క చెప్పాల్సిందే!

మొదటిపేజీ తరువాయి

వెజ్ బిర్యానీ (750 గ్రాములు) ధర రూ.115, చికెన్ బిర్యానీ రూ.170, మటన్ బిర్యానీ రూ.180గా పేర్కొన్నారు. కార్యకర్తలకు అందించే నీటి ప్యాకెట్‌కు రూ.2, లీటర్ వాటర్ బాటిల్‌కు రూ.20 చొప్పున లెక్క చూపాల్సి ఉంటుంది.


**ప్రచార సామగ్రి, సభా వేదికలకూ ధరలు**

సభలు, సమావేశాల కోసం వినియోగించే వేదికలకు కూడా ధరలను నిర్ణయించారు. ఒక మినీ ఫంక్షన్ హాల్‌కు రోజుకు రూ.6,200, పెద్ద ఏసీ ఫంక్షన్ హాల్‌కు రూ.1,25,000గా ధరను నిర్ధారించారు. ప్రచారంలో ఎక్కువగా వినియోగించే డ్రోన్ కెమెరాకు 12 గంటల వినియోగానికి రూ.5,000గా లెక్క కట్టారు. వీటితో పాటు కుర్చీలు, బ్యానర్లు, వాల్ పోస్టర్లు, టీ షర్టులు, సౌండ్ బాక్సుల వంటి అన్ని ప్రచార సామగ్రికి నిర్దిష్ట ధరలను అధికారులు ఈ జాబితాలో చేర్చారు.



# అంతా చొరబాట్ల వల్లే..

- దేశంలో కొన్ని ప్రాంతాల్లో జనాభా మార్పులకు చొరబాట్లే కారణమన్న అమిత్ షా
- కొన్ని పార్టీలు చొరబాటుదారులను ఓటు బ్యాంకుగా వాడుకుంటున్నాయని ఆరోపణ
- అసోం, పశ్చిమ బెంగాల్‌లో ముస్లిం జనాభా అసాధారణ వృద్ధి అని వెల్లడి
- చొరబాట్లు దేశ భద్రతకు, ప్రజాస్వామ్యానికి పెను ముప్పుగా అభివర్ణన
- సరిహద్దు భద్రతలో రాష్ట్ర ప్రభుత్వాల సహకారం తప్పనిసరి అని స్పష్టీకరణ



**నేషనల్‌బ్యూరో, ప్రజాస్వరం :**

దేశంలోని కొన్ని ప్రాంతాలలో ముస్లిం జనాభా అసాధారణంగా పెరగడానికి అక్రమ చొరబాట్లే ప్రధాన కారణమని కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షా సంచలన వ్యాఖ్యలు చేశారు. ఇది కేవలం రాజకీయ సమస్య కాదని, దేశ భద్రతకు, ప్రజాస్వామ్యానికి పెను ప్రమాదంగా పరిణమించిందని ఆయన తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. 'దైనిక్ జాగరణ్' మాజీ సంపాదకుడు నరేంద్ర మోహన్ స్మారకోపన్యాసంలో అమిత్ షా ఈ మేరకు మాట్లాడారు.కొన్ని రాష్ట్రాల్లోని జనాభా లెక్కలను ఉటంకిస్తూ అమిత్ షా తన వాదనను వినిపించారు. 2011 జనాభా లెక్కల ప్రకారం అసోంలో ముస్లిం జనాభా పదేళ్లలో 29.6 శాతం పెరిగిందని, చొరబాట్లు లేకుండా ఈ స్థాయిలో వృద్ధి అసాధ్యమని స్పష్టం చేశారు. అదేవిధంగా పశ్చిమ బెంగాల్‌లోని పలు జిల్లాల్లో ముస్లిం జనాభా వృద్ధి రేటు 40 శాతం వరకు, సరిహద్దు ప్రాంతాల్లో ఏకంగా 70 శాతం వరకు ఉందని తెలిపారు. ఇవన్నీ గతంలో జరిగిన చొరబాట్లకు నిదర్శనమని ఆయన పేర్కొన్నారు. కొన్ని రాజకీయ పార్టీలు తమ ఓటు బ్యాంకు రాజకీయాల కోసం చొరబాటుదారులకు ఆశ్రయం కల్పిస్తున్నాయని అమిత్ షా తీవ్రంగా ఆరోపించారు. "గుజరాత్, రాజస్థాన్‌లకు కూడా సరిహద్దులు ఉన్నాయి. మరి అక్కడ నుంచి చొరబాట్లు ఎందుకు జరగడం లేదు?" అని ఆయన ప్రతిపక్షాలను ప్రశ్నించారు. చొరబాట్లను అడ్డుకోవడం కేవలం కేంద్ర ప్రభుత్వం లేదా సరిహద్దు భద్రతా దళం (బీఎస్ఎఫ్) బాధ్యత మాత్రమే కాదని ఆయన స్పష్టం చేశారు.

భౌగోళిక పరిస్థితుల కారణంగా అన్ని సరిహద్దు ప్రాంతాల్లో కంచె వేయడం సాధ్యం కాదని, అలాంటి చోట్ల రాష్ట్ర ప్రభుత్వాల సహకారం అత్యంత కీలకమని అమిత్ షా వివరించారు. అక్రమంగా దేశంలోకి ప్రవేశించిన వారిని స్థానిక జిల్లా యంత్రాంగం గుర్తించడంలో విఫలమైతే చొరబాట్లను ఎలా ఆపగలమని ఆయన ప్రశ్నించారు. బంగ్లాదేశ్ నుంచి వస్తున్న చొరబాట్ల కారణంగానే ఝార్ఖండ్‌లో ఆదివాసీ జనాభా గణనీయంగా తగ్గిపోతోందని కూడా ఆయన ఆందోళన వ్యక్తం చేశారు.

# గవర్నర్ ఆమోదం తెలిపి ఉంటే హైకోర్టులో స్టే వచ్చేది కాదు

- సమగ్ర కులగణన నిర్వహించడం రాష్ట్ర ప్రభుత్వం చేసిన నేరమా...?
- బీసీ రిజర్వేషన్లు పెంచుతూ అసెంబ్లీలో చట్టం చేయడం ప్రభుత్వం చేసిన పాపమా...?
- బీసీల పట్ల చిత్తశుద్ధితో పనిచేస్తున్నదెవరు..?
- బీసీలను రాజకీయంగా వాడుకుంటున్నదెవరు..?
- బీసీ సంక్షేమ సంఘం జయశంకర్ భూపాలపల్లి జిల్లా అధ్యక్షుడు వేముల మహేందర్ గౌడ్

**భూపాలపల్లి అక్టోబర్ 11(ప్రజాస్వరం):**

కేంద్ర ప్రభుత్వం 9వ షెడ్యూల్లో బీసీ రిజర్వేషన్లను చేరిస్తే న్యాయపరమైన అవరోధాలు ఉండేవి కావని, బీసీ రిజర్వేషన్ల చట్టానికి గవర్నర్ ఆమోదం తెలిపి ఉంటే హైకోర్టులో స్టే వచ్చేది కాదని బీసీ సంక్షేమ సంఘం జయశంకర్ భూపాలపల్లి జిల్లా అధ్యక్షుడు వేముల మహేందర్ గౌడ్ అభిప్రాయపడ్డారు. శనివారం ఆయన మీడియా సమావేశంలో మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం సమగ్ర కులగణన నిర్వహించి, బీసీ రిజర్వేషన్లను పెంచుతూ అసెంబ్లీలో చట్టం చేయడం రాష్ట్ర ప్రభుత్వం చేసిన నేరమా..? అని బిజెపి బిఆర్ఎస్ పార్టీలను మహేందర్ గౌడ్ ప్రశ్నించారు. రాష్ట్ర ప్రభుత్వం తీసుకువచ్చిన ఆర్డినెన్సుపై ఇప్పటిదాకా గవర్నర్ సంతకం పెట్టకుండా తాత్సారం చేస్తే..విధిలేని పరిస్థితుల్లో ప్రభుత్వం జీఓ జారీ చేసిందన్నారు. బీసీ రిజర్వేషన్లపై రాజకీయ పార్టీలన్నీ డ్రామాలాడుతున్నాయని, ఒక పార్టీ మీద ఇంకొక పార్టీ నెపం నెట్టడమే తప్ప బీసీలకు నిజమైన మద్దతు ఇవ్వడం లేదని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. స్వాతంత్రం వచ్చినప్పటి నుండి ఇప్పటివరకు కింది నుంచి పై కోర్టుల వరకు బీసీ రిజర్వేషన్లు పెంచిన ప్రతిసారి కోర్టులను వేదికగా చేసుకుని రిజర్వేషన్ వ్యతిరేకులు అడ్డుకుంటున్నారని, కోర్టులు కూడా బీసీలకు న్యాయం చేయడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. బీసీ రిజర్వేషన్లకు రాజ్యాంగ భద్రత దక్కడానికి మొదటి నుండి బీసీ సమాజమంతా తొమ్మిదవ షెడ్యూల్లో చేర్చాలని డిమాండ్ చేస్తున్నప్పటికీ బిజెపి నేతలు మాత్రం బీసీ రిజర్వేషన్లు పెంచుకునే అధికారం రాష్ట్ర ప్రభుత్వానికే ఉందని పదేపదే బీసీ సమాజాన్ని తప్పుదోవ పట్టించారాని, బిజెపి నేతలు రాష్ట్ర గవర్నర్ ను కలిసి ఉంటే గవర్నర్ సానుకూల నిర్ణయం తీసుకునే వారనీ, ఇదేమి చేయకుండా బీసీ రిజర్వేషన్లు అమలు చేయాలని బీజేపీ అనడం సిగ్గుచేటన్నారు. బీసీల పట్ల చిత్తశుద్ధితో పనిచేస్తున్నదెవరో..బీసీలను రాజకీయంగా వాడుకుంటున్నదెవరో ప్రజలు గమనిస్తున్నారన్నారు. కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీ ప్రకారం సమగ్ర కుల గణన నిర్వహించి..బీసీలకు 42 శాతం రిజర్వేషన్ కల్పిస్తానంటే.. బిజెపి, టిఆర్ఎస్ పార్టీ నాయకులకు కడుపు మండుతోందని, ఇకనైనా బిజెపి, బిఆర్ఎస్ పార్టీలు డ్రామాలు ఆపి బీసీ రిజర్వేషన్ల కోసం చిత్తశుద్ధితో పనిచేయాలని హితవు పలికారు.



# ఉద్యోగాలు వెతికేవారుగా కాకుండా ఉద్యోగాలు ఇచ్చేవారుగా యువత ఉండాలి

**మొదటిపేజీ తరువాయి**

రాష్ట్ర ఏర్పాటు సాధ్యం కాదని చాలామంది సందేహించారని, అలాంటి రాష్ట్రాన్ని సాధించామని పేర్కొన్నారు. 11 సంవత్సరాల తర్వాత ఎన్నో రంగాల్లో దేశానికి ఆదర్శంగా తెలంగాణ నిలబడిందని వ్యాఖ్యానించారు. తెలంగాణ సాధించిన ప్రగతి విశ్వాసానికి, పట్టుదలకు, దార్శనికతకు నిదర్శనమని అన్నారు.

మీరు ఇతరులు అనుకున్న దాని కంటే చాలా తెలివైన వారని, బాధ్యత కలిగిన వారని జెన్ జెడ్‌ను ఉద్దేశించి అన్నారు. భారతదేశాన్ని ముందుకు నడిపించేది మీరేనని వ్యాఖ్యానించారు. మోటార్ స్పోర్ట్స్ అయినా, జీవితమైనా విజయం కేవలం యాదృచ్ఛికంగా రాదని సూచించారు. మనం అవకాశాలను రూపొందించుకోవాలని, ధైర్యంతో అమలు చేయాలని, అప్పుడే భవిష్యత్తు నిర్మితమవుతుందని అన్నారు.



గత ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడు భారతదేశంలో తొలిసారిగా హైదరాబాద్‌లో విజయవంతంగా నిర్వహించిన ఫార్ములా ఈరేస్ నిర్వహణ గురించి ప్రస్తావించారు. తాము నిర్వహించిన ఫార్ములా ఈరేసు కేవలం ఒక క్రీడా కార్యక్రమం కాదని, ఆవిష్కరణలు, క్లీన్ మొబిలిటీ, అత్యాధునిక సాంకేతికతకు తెలంగాణ కేంద్రంగా ప్రపంచ వేదికపై అడుగు పెట్టిందనడానికి ప్రతీక అని కేటీఆర్ అన్నారు.



# రాష్ట్రంలో జర్నలిస్టుల సమస్యలు సత్వరం.. పరిష్కరించండి

- ఇళ్ల స్థలాలు వెంటనే కేటాయించండి
- కనీస పెన్షన్ సదుపాయం కల్పించండి
- ఐ అండ్ పీఆర్ నూతన డైరెక్టర్ విశ్వనాథన్ తో ఫెడరేషన్ నేతలు వినతి

**సిరిపురం అక్టోబర్ 11(ప్రజాస్వరం):**

రాష్ట్రంలో సుదీర్ఘకాలంగా జర్నలిస్టులు ఎదుర్కొంటున్న సమస్యలను వీలైనంత త్వరగా పరిష్కరించాలని రాష్ట్ర ఐ అండ్ పి ఆర్ నూతన డైరెక్టర్ గా నియమితులైన కె .విశ్వనాథన్ ను ఏపీ వర్కింగ్ జర్నలిస్టుల ఫెడరేషన్ కార్యవర్గం కోరింది.. శనివారం ఇక్కడ వి ఎం ఆర్ డి ఏ కార్యాలయంలో జాతీయ జర్నలిస్టుల సంఘం కార్యదర్శి గంట్ల శ్రీనుబాబు, విశాఖ జిల్లా అధ్యక్షులు పి నారాయణ, కార్యదర్శి జి శ్రీనివాసరావు, ఉపాధ్యక్షులు బి శివప్రసాద్ లు నూతన డైరెక్టర్ ను మర్యాదపూర్వకంగా కలుసుకొని శేష వస్త్రంతో ఘనంగా సత్కరించారు.. ఈ సందర్భంగా జర్నలిస్టులు ఎదుర్కొంటున్న పలు అంశాలను డైరెక్టర్ దృష్టికి ఫెడరేషన్ నేతలు తీసుకువెళ్లారు.. కూటమి ప్రభుత్వం ఏర్పడి ఏడాదిన్నర పూర్తికావస్తున్న నేటికీ జర్నలిస్టులకు నూతన అక్రిడేషన్లు మంజూరు కాలేదన్నారు.. కనీసం ఇప్పటివరకు నూతన దరఖాస్తులు స్వీకరించలేదని వీరు చెప్పారు. అలాగే చిన్న మధ్యతరహా పత్రికలకు సంబంధించి తాజా జీవో ప్రకారం కొద్దిగా మార్పులు చేయాల్సి ఉందన్నారు. అలాగే సుదీర్ఘకాలంగా పెండింగ్ లో ఉన్న జర్నలిస్టుల ఇళ్ల స్థలాల సమస్యను.. ఇతర రాష్ట్రాల మాదిరిగా పెన్షన్ సదుపాయం కల్పించాలని కోరారు.. కనీస పెన్షన్ సదుపాయం కల్పించండి అని చెప్పారు.. ఇందుకు నూతన డైరెక్టర్ సానుకూలంగా స్పందించారు. తన పరిధి మేరకు జర్నలిస్టులకు సంబంధించిన సమస్యలను వీలైనంత త్వరగా పరిష్కరించడానికి కృషి చేస్తామన్నారు.. అలాగే ప్రభుత్వపరంగా పరిష్కరించాల్సిన సమస్యలు వారి దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరించేందుకు తనవంతు ప్రయత్నం చేస్తానన్నారు.. సోమవారం అమరావతిలో తాను బాధ్యతలు స్వీకరించినున్నట్లు డైరెక్టర్ చెప్పారు.

# తనపై అక్రమ కేసులు పెట్టారంటూ డీజీపీకి రాజాసింగ్ లేఖ

- మధ్యప్రదేశ్ ప్రసంగాన్ని వక్రీకరించారని ఫిర్యాదు
- హైదరాబాద్‌లోని 31 పోలీస్ స్టేషన్లలో కేసులు ఉన్నాయని వెల్లడి
- హైదరాబాద్‌కు సంబంధం లేకుండా కేసులెలా పెడతారని ప్రశ్న



**హైదరాబాద్, ప్రజాస్వరం :**

తనపై హైదరాబాద్ పోలీసులు అక్రమంగా కేసులు బనాయిస్తున్నారని ఆరోపిస్తూ గోషామహల్ ఎమ్మెల్యే రాజా సింగ్ రాష్ట్ర డీజీపీకి లేఖ రాశారు. మధ్యప్రదేశ్‌లో తాను చేసిన ప్రసంగాన్ని వక్రీకరించి, హైదరాబాద్‌తో సంబంధం లేకుండా కేసులు నమోదు చేయడంపై ఆయన తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. ఈ కేసుల వెనుక ఉన్న కారణాలను స్పష్టం చేయాలని డిమాండ్ చేశారు. ఆయన తనపై నమోదైన కేసుల వివరాలను మీడియాకు వెల్లడించారు. మధ్యప్రదేశ్‌లో జరిగిన ఓ హిందూ సభలో తాను చేసిన ప్రసంగంలోని వ్యాఖ్యలను పోలీసులు వక్రీకరించారని రాజా సింగ్ తన లేఖలో ఆరోపించారు. హైదరాబాద్ నగర పరిధికి సంబంధం లేని విషయంపై ఇక్కడ ఎలా కేసు నమోదు చేస్తారని ఆయన పోలీసులను సూటిగా ప్రశ్నించారు.తనపై మొత్తం 31 పోలీస్ స్టేషన్లలో కేసులు నమోదు చేసినట్లు రాజా సింగ్ తెలిపారు. కాంచన్‌బాగ్, శాలిబండ, నాంపల్లి, అంబర్‌పేట్, బంజారాహిల్స్, ఫలక్‌నుమా, చంద్రాయణగుట్టతో పాటు కర్ణాటకలోని బీదర్, బస్వకళ్యాణ్ పోలీస్ స్టేషన్లలో కూడా కేసులు ఉన్నాయని ఆయన పేర్కొన్నారు. ఈ కేసులన్నింటిపై తక్షణమే చర్యలు తీసుకుని, తనకు న్యాయం చేయాలని డీజీపీని కోరారు.

# 108 అంబులెన్స్ ప్రజలకు అత్యవసర సంజీవని

- -108 అంబులెన్స్ జిల్లా మేనేజర్ రాజు నాయక్

**మొగుళ్ళపల్లి అక్టోబర్ 11(ప్రజాస్వరం):**

108 అంబులెన్స్ ప్రజలకు అత్యవసర సమయంలో సంజీవనిలాగా పనిచేస్తుందని 108 అంబులెన్స్ జిల్లా మేనేజర్ రాజు నాయక్ తెలిపారు. శనివారం జయశంకర్ భూపాలపల్లి జిల్లా మొగుళ్లపల్లి మండల కేంద్రంలో ఉన్నటువంటి అత్యవసర 108 అంబులెన్స్ ను ఆయన తనిఖీ చేశారు. అందులో ఉన్నటువంటి మెడిసిన్స్, మెడికల్ ఎక్విప్మెంట్స్ వెరిఫై చేసి వర్కింగ్ కండిషన్ చెక్ చేసి, గత మూడు నెలల నుండి అంబులెన్స్ పర్ఫామెన్స్ గురించి సిబ్బందితో చర్చించడం జరిగిందన్నారు. ఎప్పటికప్పుడు మెడిసిన్స్ అప్డేట్ చేసుకుంటూ అందుబాటులో ఉంచుకోవాలని, ఫోన్ కాల్ రాగానే వెంటనే బయలుదేరాలని, మండల ప్రజలకు అందుబాటులో ఉండాలని సిబ్బందికి తగు సూచనలు చేశారు. అదేవిధంగా సీజనల్ వ్యాధులు సోకకుండా తీసుకోవాల్సినటువంటి జాగ్రత్తల గురించి వివరించారు. ముఖ్యంగా గర్భిణీ స్త్రీలు 108 ద్వారా ఆసుపత్రికి వెళ్లాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో ఎమర్జెన్సీ మెడికల్ టెక్నీషియన్ రాజు మరియు పైలెట్ శ్రీను తదితరులు పాల్గొన్నారు.



# కందకం రోడ్డు కు 20 కోట్లు 2014 లో నేనే తెచ్చిన, మళ్లీ ఇప్పుడు నేనే పూర్తి చేయాల్సి వస్తోంది

- ఆర్ అండ్ బి, మున్సిపల్ అధికారులతో టీజిఐఐసి చైర్ పర్సన్ నిర్మల జగ్గారెడ్డి సమీక్ష సమావేశం

**సంగారెడ్డి జిల్లా అక్టోబర్ 11(ప్రజాస్వరం):**

కందకం రోడ్డు పొడవు 2.5 కిలో మీటర్లు కల్వర్టు ల తో సహా దాదాపు పని పూర్తయింది. ఈశ్వర మంధిర్ దగ్గర ఏడు ఇళ్ళ తొలగింపులో సమస్య ఉంది. డబుల్ బెడ్ రూం ఇళ్లు ఇస్తామంటే వారు ఒప్పుకోవడం లేదు. దానికి బదులుగా ఇంటి స్థలం, ఇల్లు నిర్మించి ఇవ్వాలని వారు డిమాండ్ చేస్తున్నారని జగ్గారెడ్డి దృష్టికి తీసుకువచ్చిన అధికారులు, స్థానిక నాయకులు కందకం రోడ్ 2014 జనవరిలో ఉమ్మడి రాష్ట్రంలో మంజూరు అయితే, ఇప్పటి వరకూ ఎందుకు పూర్తి చేయలేక పోయారని అధికారులను ప్రశ్నించిన జగ్గారెడ్డి ఉమ్మడి రాష్ట్రంలో కిరణ్ కుమార్ రెడ్డి ముఖ్యమంత్రిగా, మున్సిపల్ మంత్రి మహేందర్ రెడ్డి ఉన్నప్పుడు, స్పెషల్ జిఓ తెచ్చి 20 కోట్లు మంజూరు చేయడం జరిగింది. 11 సంవత్సరాలలో 15 కోట్లు ఖర్చు చేశారు. ఇప్పటికీ పూర్తి చేయలేక పోయారు. 2014 లో నేను ఎమ్మెల్యేగా ఉన్నప్పుడు కందకం రోడ్డు కోసం 20 కోట్లు తెస్తే ఇంకా 5 కోట్లు పనులు ఈ 11 ఏళ్లలో పూర్తి చేయలేక పోయారు. 2014 లో నేను తెచ్చిన 20 కోట్ల జిఓ కు, 11 ఏళ్ల తర్వాత మళ్లీ నేనే ఇప్పుడు రివ్యూ చేయాల్సి వస్తుందంటే సదాశివ పేట ప్రజలు ఆలోచించాలి. ఇన్నేళ్లు ఏం చేశారని అప్పుడు బిఆర్ఎస్ లో ఉన్న మాజీ మున్సిపల్ చైర్మన్ లు సుభాష్, విశ్వనాథ్ లను ప్రశ్నించిన జగ్గారెడ్డి ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ దగ్గరకు వెళ్ళి ఎన్నో సార్లు అడిగామని, ఆ కుంపటి మనకెందుకు అని వదిలేయమని చెప్పి పట్టించుకోలేదని జవాబిచ్చిన మాజీ చైర్మెన్ లు మంత్రి హరీష్ రావు దృష్టికి సైతం కందకం రోడ్డు విషయం తీసుకెళ్లామని నిర్వాసితుల సమస్య తీర్చమని అడిగామని జగ్గారెడ్డి కి వివరించిన మాజీ మున్సిపల్ చైర్మన్ లు సుభాష్, విశ్వనాథ్ నిర్వాసితుల కు డబుల్ బెడ్ రూం లు తప్పా వేరే ఏ పరిహారం ఇచ్చేదిలేదని హరీష్ రావు చెప్పాడని కందకం రోడ్ సమస్య ను ఇటు చింతా ప్రభాకర్, అటు హరీష్ రావు పట్టించుకోలేదని తెలిపిన స్థానికులు 2014 లో నేను ఎమ్మెల్యే ఉన్నప్పుడే కందకం పనులు ప్రారంభం అయ్యింది. కానీ ఇప్పటికీ పూర్తి చేయలేకపోయారు. సదాశివ పేట ప్రజలు నాకు రెస్ట్ ఇచ్చారు. సదాశివ పేట ప్రజలు స్థానికుడు కాబట్టి చింతా ప్రభాకర్ కు ఓటేశారు, ఆ విషయం లో నేనెప్పుడూ తప్పు పట్ట లేదు. సదాశివ పేట కు నేను రావడం లేదని సదాశివ పేట నాయకులు అడుగుతున్నారని నిర్మల చెప్పింది. సదాశివ పేట లో దసరా వేడుకలు జరుపుదామని రెండు మూడు సార్లు ప్రయత్నించిన, ఇక్కడ పరిస్థితుల వల్ల సాధ్యం కాలేదు. ఇప్పుడు మా ప్రభుత్వం ఉంది, సీఎం రేవంత్ రెడ్డి, మంత్రులు నా మాట వింటారు. నిధులు తెచ్చే అవకాశం ఉంది కాబట్టి నేను మళ్ళీ కందకం రోడ్ పై రివ్యూ చేస్తున్న, ఎనిమిది మంది నిర్వాసితుల కు ఒక్కొక్కరికి 150 గజాల స్థలం, స్లాబ్ ఉన్నవారికి 15 లక్షలు, రేకులు ఉన్నవారికి 10 లక్షల పరిహారం ఇచ్చేలా ప్రతిపాదనలు సిద్ధం చేయాలని అధికారులకు సూచన, రోడ్ వెడల్పు లో శివాలయం ను ముట్టుకోవద్దు, ఈ విషయాన్ని నేను 2014 లోనే చెప్పిన, శివాలయానికి ఇబ్బంది లేకుండా పనులు జరగాలి జాతీయ రహదారి అనుకుని, బస్టాండ్ ఎదురుగా ఉన్న నాలుగు షాప్ లు తొలగించాలని కోర్టు కేసు ఉందని జగ్గారెడ్డి కి వివరించిన అధికారులు, వారికి కావాల్సిన పరిహారం ఎంత? వారు ఏం కోరుకుంటున్నారో తెల్సుకుని ప్రతిపాదన సిద్ధం చేయాలని అధికారులకు సూచన. జ్యోతి టాకీస్ దుర్గమ్మ గుడి, చిన్న గంజి రోడ్, కుమ్మరి ఖేరి, వెంకటపూర్ రోడ్, ఈశ్వర్ మందిర్, బంగారు మైసమ్మ, ఎనికేపల్లి రోడ్, నేషనల్ హైవే రోడ్ వద్ద జంక్షన్ లు ఏర్పాటు కు ప్రతిపాదన సిద్దం చేయాలని సూచన, కోర్టు కేసులు ఉన్న ప్లేస్ లలో వదిలేసి మిగతా చోట పనులు వెంటనే ప్రారంభించాలని అధికారులకు సూచన, పనులు అయ్యే లోపు కోర్టు కేసులు, పరిహారం సమస్యలను పరిష్కరిద్దామని అధికారులకు చెప్పిన జగ్గారెడ్డి, ఈ కందకం రోడ్డు మొత్తం పూర్తయితే సదాశివ పేట రూపు రేఖలు మారిపోతాయి, డివైడర్, సెంట్రల్ లైటింగ్ తో ఒక నెక్లెస్ రోడ్ గా మారిపోతుంది. మనం చేసే పని ఏదైనా ఓట్ల తో సంబంధం పెట్టకూడదు, మనం బలహీనులం కాదని ఈ విషయం దృష్టి లో పెట్టుకోవాలని కార్యకర్తలకు సూచించిన జగ్గారెడ్డి. నాకు రెండు రైట్స్ ఉన్నాయి, ఒక మాజీ ఎమ్మెల్యే గా నేను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కి నిధుల విషయం లో లేఖ రాసే అధికారం ఉంది. జిల్లా అధికారులకు కార్పొరేషన్ చైర్ పర్సన్ గా అధికారికంగా నిర్మల లేఖలు ఇస్తుంది. ఈ విషయం సదాశివ పేట ప్రజలు, మీడియా గమనించాలి. ఈ పదేళ్లలో సీఎం సదాశివ పేట కు వచ్చాడా అని స్థానికులను ప్రశ్నించిన జగ్గారెడ్డి రాలేదు అని సమాధానం ఇచ్చిన స్థానికులు, నా హయాం లో సదాశివ పేట కు రాజశేఖర్ రెడ్డి, కిరణ్ కుమార్ రెడ్డి నీ తీసుకువచ్చా అదీ జగ్గారెడ్డి కెపాసిటీ. కందకం రోడ్డు పనులు త్వరగా పూర్తి చేయండి, సీఎం రేవంత్ రెడ్డి చేతుల మీదుగా ప్రారంభోత్సవం చేయిస్తా, ముఖ్యమంత్రి నీ నేనే పిలిపిస్తా కానీ నేను మాత్రం రాను. నేను వంట వండుతా.... మీరు తిని పొండి అంతే, వంట వండే వాడే గ్రేట్.



# మహిళా ప్రాణాలను కాపాడిన డయల్ 100 కాల్



- **అభినందించిన జిల్లా ఎస్పీ**

**మెదక్, అక్టోబర్ 11 (ప్రజా స్వరం) :**
ఆత్మహత్య యత్నానికి పాల్పడిన మహిళను పోలీసులు కాపాడిన సంఘటన హవేలీ ఘనపూర్ మండలం లో చోటు చేసుకుంది. శనివారం హవేలీ ఘనపూర్ మండలం లింగ్సన్ పల్లి గ్రామం జ్యోతి అనే మహిళ తన ఇంటిలో ఆత్మహత్య ప్రయత్నం చేసుకుంటుందని గ్రామస్థులు డయల్ 100 సమాచారం రావడం జరిగింది. తక్షణమే స్పందించిన పోలీసులు అక్కడికి చేరుకున్న హోం గార్డ్ వరప్రసాద్ (లడ్డు), వరప్రసాద్, జైయనంద్, రమేష్ లు గడ్డపార సహాయంతో తలుపులు పగులగొట్టారు. మహిళ అపస్మారక స్థితిలోకి వెళ్లడంతో వెంటనే స్పందించిన వరప్రసాద్ మహిళకు సిపిఆర్ చేసి మెదక్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఎస్ఐ నరేష్ కూడా ఆసుపత్రికి వెళ్లి ఆమెకు మెరుగైన వైద్యం అందించాలని సూచించారు. మహిళ ప్రాణాలను కాపాడినందుకు వరప్రసాద్, జైయనంద్, రమేష్ లను జిల్లా ఎస్పీ శ్రీనివాస రావు అభినందించారు.



# కేంద్ర ప్రభుత్వ పథకాలపై ప్రధాని మోదీ లైవ్

**శామీర్ పేట అక్టోబర్ 11(ప్రజాస్వరం) :**
మూడు చింతల పల్లి రైతువేదికలో శనివారం కేంద్ర ప్రభుత్వ పథకాల పైన ప్రధానమంత్రి నరేంద్ర మోడీ కార్యక్రమం లైవ్ లో నిర్వహించడం జరిగింది. పిఎం ధన్ ధన్య క్రిషి యోజన, మిషన్ ఫర్ ఆత్మ నిర్భర్త ఇన్ పల్సెస్, అగ్రికల్చర్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ ఫండ్, ఏనిమల్ హస్బెండరీ, ఫిషరీస్, ఫుడ్ ప్రాసెసింగ్ సెక్టార్ వంటి పథకాలను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి (డిఏఓ) చంద్రకళ, ఏ డి ఏ. వెంకట్రామ్ రెడ్డి, జిల్లా ఉద్యాన వన అధికారి( డిహెచ్ఎస్ఓ), మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లాలోని అన్ని మండల వ్యవసాయ అధికారులు, ఉద్యన వన అధికారులు, వ్యవసాయ విస్తరణ అధికారులు, రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొని పలు అంశాలను తెలుసుకోవడం జరిగింది.

# హెల్మెట్‌తో ప్రాణాలకు రక్షణ

## శామీర్ పేట ప్రెస్ క్లబ్‌లో పోలీసు అధికారులు సందేశం

**శామీర్‌పేట, అక్టోబర్ 11(ప్రజాస్వరం) :**
'రోడ్డు ప్రమాదాల్లో ప్రాణాలు పోతే తిరిగి రావు.. ద్విచక్ర వాహనదారుల ప్రాణాలకు రక్షణ హెల్మెట్ మాత్రమే' అని పోలీసు అధికారులు హెచ్చరించారు. ఉమ్మడి శామీర్ పేట మండల ప్రింట్ మీడియా ప్రెస్ క్లబ్ కార్యాలయంలో, ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు క్యాతం రవి ఆధ్వర్యంలో, దాతగా హజ్ కమిటీ సభ్యుడు ముజీబుద్దీన్ సహకారంతో విలేకరులకు హెల్మెట్ల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు.



**హెల్మెట్ ప్రాణరక్షకమే..**
**- ఎస్ హెచ్ ఓ గురువయ్య**
"రోడ్డు ప్రమాదాల్లో మరణిస్తున్న వారిలో 85 శాతం మంది హెల్మెట్ ధరించని ద్విచక్ర వాహనదారులే. చిన్న దూరం అయినా, పెద్ద దూరం అయినా తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలి. హెల్మెట్ ధరించి క్లిప్ కట్టకపోతే ఉపయోగం ఉండదు. సెల్‌ఫోన్ మాట్లాడుకుంటూ వాహనం నడపొద్దు. ట్రాఫిక్ నిబంధనలు పాటించకపోతే ప్రమాదం తప్పదు. సైబర్ నేరాలపై కూడా ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలి. లోన్లు ఆన్లైన్‌లో తీసుకోవద్దు, అపరిచిత ఏపికె యాప్‌లు డౌన్‌లోడ్ చేయొద్దు" అని సూచించారు.

**తల ప్రధానం... హెల్మెట్ తప్పనిసరి**
**– ట్రాఫిక్ ఎస్సై నవీన్ రెడ్డి**
"రోడ్డు ప్రమాదాల్లో ఎక్కువ మంది ప్రాణాలు కోల్పోతున్నవారు ద్విచక్ర వాహనదారులే. మానవ శరీరంలో ఏ అవయవాన్నైనా మార్చవచ్చు కానీ తల మార్చే టెక్నాలజీ లేదు. తల లేకుంటే ప్రాణం ఉండదు. అందుకే హెల్మెట్ పెట్టుకోవడం తప్పనిసరి. మీకోసం మాత్రమే కాదు, మీ కుటుంబం కోసం కూడా ట్రాఫిక్ నియమాలు పాటించి వాహనం నడపాలి" అని సూచించారు.

**యువతే ప్రమాదాలకు బలైపోతుంది**
**– డీఐ రాజు**
"2024లో దేశవ్యాప్తంగా జరిగిన 55,500 రోడ్డు ప్రమాదాల్లో సుమారు 1.80 లక్షల ద్విచక్ర వాహనదారులు గాయపడ్డారు. వీరిలో 30 వేల మంది హెల్మెట్ ధరించకపోవడం వల్ల మృతి చెందారు. ముఖ్యంగా 14 నుంచి 30 ఏళ్లలోపు యువతే ఎక్కువగా బలవుతోంది. స్కూల్ పరిసరాల్లోనే ప్రమాదాలు అధికంగా జరుగుతున్నాయి. విలేకరులు సమాజానికి మేలు చేయగలిగినవారు కాబట్టి ట్రాఫిక్ రూల్స్‌పై అవగాహన కల్పించాలి. సైబర్ నేరాలపై కూడా ప్రతిఒక్కరికి అవగాహన అవసరం" అని అన్నారు.



**అవసరమైతే సిగ్నల్స్ ఏర్పాటు చేస్తాం**
**- ఎస్సై శశివర్ధన్ రెడ్డి**
"హైవేల్లో 100 కి.మీ. వేగం పాటించే వారు గ్రామీణ చౌరస్తాల్లోనే ఎక్కువ ప్రమాదాలకు గురవుతున్నారు. పెద్దమ్మకాలనీ చౌరస్తాలో తరచుగా ప్రమాదాలు జరుగుతున్నాయి. గ్రామీణ ప్రాంతం కాబట్టి చాలా మంది హెల్మెట్ లేకుండా ద్విచక్ర వాహనాలు నడుపుతున్నారు. ఎవరైనా సైబర్ క్రైమ్‌కు లేదా రోడ్డు ప్రమాదానికి గురైతే వెంటనే 1930, 1945 నెంబర్లకు డయల్ చేయాలి" అని సూచించారు.

**విలేకరులకోసం ప్రత్యేక బీమా**
**- దాతముజీబుద్దీన్**
"విలేకరులకు హెల్మెట్లు అందించే అవకాశం రావడం సంతోషంగా ఉంది. సమాజ శ్రేయస్సు కోసం నా తరపున ఎలాంటి సహకారం కావాలన్నా చేస్తాను. విలేకరులకు గ్రూప్ ఇన్సూరెన్స్ చేయిస్తాను. ట్రాఫిక్ సిగ్నల్స్ ఏర్పాటు చేయాలని కాంగ్రెస్ పార్టీ తరపున ఇప్పటికే నివేదికలు పంపాము. రోడ్డు భద్రతపై అందరూ కృషి చేయాలి" అని అన్నారు.

ఈ కార్యక్రమంలో ఎస్ హెచ్ ఓ గురువయ్య, డీఐ రాజు, ఎస్సై శశివర్ధన్ రెడ్డి, ట్రాఫిక్ ఎస్సై నవీన్ రెడ్డి, ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు క్యాతం రవి, హజ్ కమిటీ సభ్యుడు ముజీబుద్దీన్, స్థానిక విలేకరులు తదితరులు పాల్గొన్నారు.

# ఎల్ఐసి ఆధ్వర్యంలో సరదాగా.. సందడిగా





**శామీర్ పేట అక్టోబర్ 11(ప్రజాస్వరం) :**
లైఫ్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్ (ఎల్ఐసి) సిటీ బ్రాంచ్14 ఉద్యోగులు, ఏజెంట్లు సరదాగా సందడిగా కాలక్షేపం చేశారు. శనివారం మండల కేంద్రం శామీర్‌పేటలోని దుప్పుల పార్కులో ఉదయం నుంచి సాయంత్రం వరకు ఆటపాటలతో ఆనందంగా గడిపారు. చత్రి దూండో, మ్యూజికల్ చైర్, అవును కాదు ఆపోజిట్, గ్లాసు పట్టుకోండి, తంబోలా లాంటి ఆటలతో కుటుంబ సభ్యులతో కలిసి కాలక్షేపం చేశారు. చిన్నారులు భరతనాట్యం పాటలతో అందరిని అలరించారు. పోటీల్లో గెలిచిన విజేతలకు బహుమతులను ప్రధానం చేశారు. మధ్యాహ్నం రుచికరమైన భోజనాలతో సహపంక్తి భోజనాలు చేశారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ ప్రస్తుత తీరికలేని జీవితంలో ఒకరోజు తోటి వారితో కలిసి ఇలా హాయిగా గడపడం ఎంతో ఆనందంగా ఉందని అన్నారు. ఇలాంటి కార్యక్రమాలు ఉత్సాహాన్ని ఉత్తేజాన్ని పెంపొందించి మరింతగా కష్టపడేందుకు దోహదపడతాయని తెలిపారు. కార్యక్రమంలో సీనియర్ బ్రాంచ్ మేనేజర్ శ్రీనివాసులు, ఏబిఎం మాధవ్, ఎస్ఓబిఎం గిరీష్ రాజ్, సీనియర్ ఏజెంట్లు, డెవలప్మెంట్ ఆఫీసర్లు, చీఫ్ లైఫ్ ఇన్సూరెన్స్ అడ్వైజర్లు పాల్గొన్నారు.

# బీసీలకు అన్యాయం చేస్తే ఊరుకునే ప్రసక్తే లేదు

- **రిజర్వేషన్ అమలు కోసం..**
- **కలసిరాని పార్టీలకు పుట్టగతులుండవు**
- **బీసీల జీవితాలతో చెలగాటమాడితే సహించేది లేదు**
- **జాగృతి రాష్ట్ర ఉపాధ్యక్షులు కొట్టాల యాదగిరి ముదిరాజ్**



**గజ్వేల్, (ప్రజాస్వరం) :**
స్థానిక సంస్థల ఎన్నికలతో పాటు విద్య, ఉద్యోగ నియామకాల్లో కలిసిరాని రాజకీయ పార్టీలకు పుట్టగతులు ఉండవని జాగృతి రాష్ట్ర ఉపాధ్యక్షులు కొట్టాల యాదగిరి ముదిరాజ్ హెచ్చరించారు. శనివారం గజ్వేల్ లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. కోర్టులను అడ్డం పెట్టుకొని 42 శాతం రిజర్వేషన్ అడ్డుకున్న వారి రాజకీయ భవిష్యత్తు ప్రశ్నార్ధకమవుతుందని పేర్కొన్నారు. ముఖ్యంగా బీసీల జీవితాలతో చెలగాటమాడితే ఊరుకునేది లేదని హెచ్చరిస్తూ, బడుగు, బలహీన వర్గాల అభివృద్ధిని అడ్డుకుంటున్న రాజకీయ పార్టీలకు తగిన బుద్ధి చెప్తామని ఆగ్రహం వ్యక్తం చేశారు. 42 శాతం రాజకీయ రిజర్వేషన్ తో పాటు విద్య, ఉద్యోగ నియామకాల బిల్లు అసెంబ్లీలో ప్రవేశపెట్టి ఆరు నెలలవుతుందని గుర్తు చేశారు. అసెంబ్లీ, కౌన్సిల్ ఆమోదం పొందినప్పటికీ బిల్లులు గవర్నర్, రాష్ట్రపతి వద్ద పెండింగ్లో ఉండడం దురదృష్టకరమని ఆవేదన వ్యక్తం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం 42 శాతం రిజర్వేషన్ అమలు కోసం జీవో నెంబర్ 9 తేగా, రాజకీయ పార్టీల అండతో కొన్ని దుష్టశక్తులు అడ్డుకున్నట్లు విమర్శించారు. అయితే రాష్ట్రపతి, గవర్నర్ వద్ద ఉన్న పెండింగ్ బిల్లుల ఆమోదం కోసం సీఎం రేవంత్ రెడ్డి ప్రయత్నించకపోవడం తగదని నిలదీస్తూ వారిపై సుప్రీంకోర్టులో న్యాయ పోరాటం చేయాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ ఇచ్చిన హామీ మేరకు స్థానిక సంస్థల ఎన్నికల్లో 42 శాతం రిజర్వేషన్ అమలు చేసే వరకు ఎన్నికలు నిర్వహించవద్దని, ఇందుకోసం ప్రజలను చైతన్యం చేస్తామని వివరించారు. ఈ కార్యక్రమంలో గజ్వేల్ బార్ అసోసియేషన్ ఉపాధ్యక్షులు నరేష్, న్యాయవాది శ్రీనివాస్ పాల్గొన్నారు.



# శ్రీ రేణుక ఎల్లమ్మ కళ్యాణానికి ఆహ్వానం

**శామీర్ పేట, అక్టోబర్11(ప్రజాస్వరం) :**
శ్రీ రేణుక ఎల్లమ్మ కళ్యాణానికి విచ్చేయాలని పలువురికి ఆహ్వాన పత్రికను గౌడ సంఘం ఆధ్వర్యంలో శనివారం అందజేశారు. మండల కేంద్రం శామీర్ పేటలో శ్రీ రేణుక ఎల్లమ్మ కళ్యాణం ఈనెల 14 నిర్వహిస్తున్నట్లు గౌడ సంఘం సభ్యులు తెలిపారు. అమ్మవారి కళ్యాణానికి ఎమ్మెల్యే మల్లారెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు సుధీర్ రెడ్డి, కూన శ్రీశైలం గౌడ్, మేడ్చల్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు హరివర్ధన్ రెడ్డి, మేడ్చల్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ వజ్రెష్ యాదవ్, మేడ్చల్ నియోజకవర్గం బీ ఆర్ ఎస్ పార్టీ ఇంచార్జ్ మహేందర్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకుడు నక్క ప్రభాకర్ గౌడ్ లకు ఆహ్వాన పత్రికలు అందజేసి కళ్యాణంలో పాల్గొనాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆర్టిఏ సభ్యుడు జైపాల్ రెడ్డి, కట్ట మైసమ్మ చైర్మన్ మహేందర్ యాదవ్, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు మోహన్ రెడ్డి, నాయకులు వెంకటరెడ్డి, నరసింహారెడ్డి, గౌడ సంఘం సభ్యులు మురళి గౌడ్, పవన్ గౌడ్, సాయి గౌడ్, శివ గౌడ్, వంశీ గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

# మజీద్‌పూర్‌లో మెగా ఉచిత వైద్య శిబిరం

- ఉచిత వైద్య శిబిరాన్ని ప్రారంభించిన మున్సిపల్ కమిషనర్ చంద్రశేఖర్
- 379 మందికి ఉచిత వైద్య పరీక్షలు.. ఉచితంగా మందులు పంపిణీ







**శామీర్ పేట అక్టోబర్ 11(ప్రజాస్వరం) :**

ఉచిత వైద్య శిబిరాలను ప్రజలు సద్వినియోగపరుచుకోవాలని అలియాబాద్ మున్సిపల్ కమిషనర్ చంద్రశేఖర్ అన్నారు. శనివారం లక్ష్మక్కపల్లిలోని ఆర్ వి ఎం ఆస్పత్రి ఆధ్వర్యంలో అలియాబాద్ మున్సిపాలిటీ మజీద్ పూర్ లో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల కళాశాల ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు నిర్వహించిన శిబిరంలో భాగంగా ఆర్ వి ఎం ఆస్పత్రి సౌజన్యంతో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా 379 మందికి వైద్య పరీక్షలు నిర్వహించగా 73 మందిని ఆర్వీఎం ఆసుపత్రికి రెఫర్ చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచేసిన ఆలియాబాద్ మున్సిపల్ కమిషనర్ చంద్రశేఖర్ మాట్లాడుతూ ఉచిత వైద్య శిబిరాలతో నిరుపేదలకు మేలు జరుగుతుందని అన్నారు. ఆర్ వి ఎం ఆసుపత్రి యాజమాన్యం ఉచిత వైద్య శిబిరం నిర్వహించినందుకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం ఆర్ వి ఎం హాస్పటల్ మార్కెటింగ్ మేనేజర్ హాస్పటల్ మంచినీళ్ల లక్ష్మణ్ మాట్లాడుతూ ఆర్వీఎం ఆసుపత్రిలో ఆధునికమైన శస్త్ర పరికరాలతో ప్రజలకు వైద్యం అందిస్తున్నారని చెప్పారు. నిరుపేదలను దృష్టిలో ఉంచుకొని ఎలాంటి ఫీజులు లేకుండా వైద్య పరీక్షలు నిర్వహిస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు, ఆర్వీఎం ఆస్పత్రి వైద్యులు, ఆసుపత్రి మేనేజింగ్ మేనేజర్ మంచినీళ్ల లక్ష్మణ్, మున్సిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ఉద్యమం ఉధృతం చేయాలి

### బీసీ యువజన సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ అశోక్



**మిర్యాలగూడ, అక్టోబర్ 11(ప్రజా స్వరం) :**

తెలంగాణ రాష్ట్రంలో బీసీలకు జరుగుతున్న అన్యాయంపై బీసీ లు అంత సంఘటితంగా ముందుకు రావాలని బీసీ సంఘం వర్కింగ్‌ప్రెసిడెంట్ తిరుమల గిరి అశోక్ అన్నారు.మిర్యాలగూడలో బీసీ యువజన సంఘం ముఖ్య నాయకుల సమావేశం ఏర్పాటు చేసిన సమావేశం లో అశోక్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో రాజకీయ పార్టీల నాయకులందరూ బీసీలను రాజకీయంగా అణచివేతకు గురి చేస్తూనే ఉన్నాయి అయినా కూడా బీసీలు సిగ్గు లేకుండా రాజకీయ పార్టీల జెండాలు మోస్తూ మన జీవితాలను మనమే అగ్రవర్ణ నాయకుల కాళ్ల దగ్గర బానిసత్వంగా బతుకుతున్నాం మనకు జరుగుతున్న అన్యాయాన్ని ప్రశ్నించడానికి మీరు ఇకనైనా బయటికి రాకపోతే భవిష్యత్తులో మీరు బీసీ నాయకులు అని చెప్పుకోవడానికి కూడా వీలు లేకుండా చేస్తాం అని ఆయన అన్నారు బీసీలకు ఇంత అన్యాయం జరుగుతున్నప్పటికీ కూడా రాజకీయ పార్టీలో ఉన్నటువంటి బీసీ నాయకులు ఎందుకు ముందుకు రావడం లేదు అని ఆయన అన్నారు రాజకీయ పార్టీలు కూడా బీసీలను ఓటు పరంగా వాడుకుంటున్నాయి తప్ప నిజంగా బీసీలకు న్యాయం జరగాలి అని ఏ ఒక్క రాజకీయ పార్టీ కూడా రోడ్ల మీదికి వచ్చి నిరసన తెలియజేసిన సందర్భం ఏక్కడ లేదు అంటే బీసీలు కేవలం ఓటు వేసే యంత్రాల మీ జెండా లు మోసే కూలీల అని ఆవేదన వ్యక్తం చేశారు అగ్రవర్ణాలకు ఒక న్యాయం న్యాయం, బీసీలకు ఒక న్యాయమా అని న్యాయస్థానాన్ని ఆశ్రయిస్తే న్యాయస్థానం కూడా అగ్రవర్ణాలకు అనుకూలంగా బీసీలకు వ్యతిరేకంగా తీర్పు ఇవ్వడం చాలా బాధాకరం న్యాయం చెప్పవలసిన న్యాయస్థానాలు ఇలా బలహీన వర్గాలను అణచివేస్తే న్యాయం జరిగేది ఎక్కడ అని ఆవేదన వ్యక్తం చేశారు బీసీలు ఇకనైనా ఐక్యంగా ఉండి పోరాటం చేసి మనకు రాజ్యాంగం ప్రకారం రావాల్సినటువంటి హక్కులను దక్కించుకోవాలని అని అన్నారు బీసీలకు మద్దతుగా ఏ రాజకీయ పార్టీ ముందుకు రాకుంటే ఆ రాజకీయ పార్టీ బీసీ వ్యతిరేక పార్టీగా ప్రచారం చేస్తామని ఆయన హెచ్చరించారు ఈ కార్యక్రమంలో.. జక్కా నాగేశ్వరరావు, సురేష్ యాదవ్, పట్టేటి రమేష్, సతీష్, రాజశేఖర్, వెంకట్, పురుషోత్తం, గంగాధర్ తదితరులు పాల్గొన్నారు



## చెడు అలవాట్లకు బానిసై వరుస దొంగతనాలు


- గోదాం చోరీ కేసులో ఇద్దరు నిందితుల అరెస్ట్
- 10 లక్షల విలువైన సిగరెట్ బాక్సుల, 8 లక్షల నగదు, 3 వాహనాల స్వాధీనం
- జిల్లా ఎస్పీ శ్రీనివాస రావు



**మెదక్ అక్టోబర్ 11 (ప్రజా స్వరం) :**

ఇంటి దొంగలే ఐటీసీ గోదాం లో వరుస చోరీలకు పాల్పడినట్లు జిల్లా ఎస్పీ శ్రీనివాస రావు పేర్కొన్నారు. శనివారం మెదక్ జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ మనోహరాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలోని ఐటీసీ గోదాం లో వరుస దొంగతనాలకు పాల్పడుతున్న నిందితులు ఈ కంపెనీ లో డ్రైవర్స్ గా పని చేసే మైదరబోయిన శ్రీకాంత్ (31), చెట్టి మహేష్ (30) ను అరెస్ట్ చేసినట్లు తెలిపారు. జల్సాలకు అలవాటు పడి అప్పులు ఎలా తీర్చాలని పని చేసే కంపెనీ లోనే దొంగతలను చేసేందుకు నిర్ణయించుకున్నారని తెలిపారు. వారిని అరెస్ట్ చేసిన సంఘటన లో నిందితుల నుండి 10 లక్షల విలువైన సిగరెట్ బాక్సులను, 8 లక్షల నగదును చోరికి వాడిన 3 వాహనాలను స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు. ఈ నిందితులు గతంలో 8,30,000/ విలువైన సిగరెట్లు దొంగతనం చేసి సొమ్ము చేసుకుని, మరోసారి 15 లక్షల విలువైన సిగరెట్లు దొంగతనం చేసినట్లు తెలిపారు. రెండు సార్లు కలిపి సుమారు 18,64,000/ రూపాయలు బయట మార్కెట్ అమ్మి సొమ్ము చేసుకుని వాటిని సమానంగా పంచుకున్నారని అన్నారు. ఈ కేసు చేదన లో సమర్ధవంతంగా పనిచేసిన తూప్రాన్ డీఎస్పీ జె. నరేందర్ గౌడ్, తూప్రాన్ సీఐ రంగ కృష్ణ, ఎస్ఐ సుభాష్ గౌడ్, హెడ్ కానిస్టేబుల్ గోవర్ధన్ రావు, కానిస్టేబుల్ రాధాకృష్ణ, బిక్షపతి, నరేందర్ గౌడ్, సురేశ్ లను అభినందించి, రివార్డ్ అందజేశారు.





# రాజ్యాంగ సవరణతో మాత్రమే బీసీ రిజర్వేషన్లు చేపట్టాలి

- **బీఆర్ఎస్ వికారాబాద్ జిల్లా అధ్యక్షుడు మెతుకు ఆనంద్**



**వికారాబాద్, అక్టోబర్ 11(ప్రజా స్వరం):**

బీసీ రిజర్వేషన్లు న్యాయపరమైన చిక్కుల్లో పడకుండా ఉండాలంటే రాజ్యాంగబద్ధంగానే అమలు జరగాలి అని వికారాబాద్ జిల్లా బీ ఆర్ ఎస్ పార్టీ అధ్యక్షులు, మాజీ ఎమ్మెల్యే మెతుకు ఆనంద్ తెలిపారు. శనివారం ఆయన వికారాబాద్ లో మీడియాతో మాట్లాడుతూ బీసీ రిజర్వేషన్ బిల్లు ఆమోదం కోసం సంపూర్ణంగా సహకరించిన బీ ఆర్ ఎస్ పార్టీ.... ఎన్నికలకు రాజ్యాంగబద్ధంగా వెళ్లాలని ముందు నుంచి ప్రభుత్వాన్ని కోరుతూనే వచ్చింది అని తెలిపారు. బీఆర్ఎస్ పార్టీ ఎన్నిసార్లు కోరిన ఆ విషయాన్ని పెడచెవిన పెట్టిన కాంగ్రెస్ పార్టీ చెల్లదని తెలిసిన ప్రజలను మభ్య పెట్టేందుకు జి ఓ ద్వారా ముందుకెళ్లింది. ఆర్డినెన్స్‌లు, జీవోల ద్వారా వచ్చే రిజర్వేషన్ల వల్ల అనేక న్యాయపరమైన చిక్కులు వచ్చే అవకాశం ఉందన్నారు. ఈ కాంగ్రెస్ ప్రభుత్వం బీసీ రిజర్వేషన్ల విషయంలో చాలా నిర్లక్ష్యంగా వ్యవహరించింది. ఇప్పటికి కూడా రాజ్యాంగబద్ధంగా రిజర్వేషన్ల అమలు ప్రయత్నం పక్కనపెట్టి, హైకోర్టు ఇచ్చిన స్టే పై సుప్రీంకోర్టును ఆశ్రయిస్తే మరింత కాలయాపన చేయడం తప్ప దాని వల్ల ఎలాంటి ప్రయోజనం ఉండదు. స్థానిక సంస్థల ఎన్నికలు సకాలంలో జరపక ఇప్పటికే గ్రామాల్లో అభివృద్ధి కుంటుపడగా, ఎన్నికల విషయంలో ఇంకా జాప్యం జరిగితే గ్రామాలు మరింత నష్టపోవాల్సి ఉంటుందన్నారు.



# రాములోరికి ఎమ్మెల్యే బుయ్యని పూజలు

**తాండూరు, అక్టోబర్ 11 (ప్రజా స్వరం) :**

తాండూరు ఎమ్మెల్యే బుయ్యని మనోహర్ రెడ్డి శనివారం యాలాల్ మండలం జుంటుపల్లి శ్రీ సీతారామ చంద్రస్వామి వారి ఆలయాన్ని దర్శించుకుని, ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం జుంటుపల్లి గ్రామ నాయకులు ఆశప్ప ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమంలో ఎమ్మెల్యే బీఎంఆర్ పాల్గొన్నారు.







# ములుగు అభివృద్ధిలో బాలమ్మది కీలకపాత్ర



**ములుగు, అక్టోబర్ 11 (ప్రజా స్వరం) :**

ప్రతి ఒక్కరూ ప్రజా ప్రతినిధిగా ఉన్నప్పుడు చేసిన అభివృద్ధి పనులే చిరస్థాయిగా నిలుస్తాయని, ములుగు అభివృద్ధిలో మాజీ సర్పంచ్ చింతకింది బాలమ్మది కీలక పాత్ర ఉందని ఎమ్మెల్సీ యాదవ రెడ్డి, అటవీ అభివృద్ధి సంస్థ మాజీ చైర్మన్ ప్రతాప్ రెడ్డి, ఉమ్మడి మెదక్ జిల్లా డీసీసీబీ డైరెక్టర్ అంజిరెడ్డి, ఏఎంసీ మాజీ చైర్మన్ జహంగీర్, భారాస రాష్ట్ర కార్యదర్శి జుబేర్ పాషా అన్నారు. ములుగు మాజీ సర్పంచ్ చింతకింది బాలమ్మ 16వ వర్ధంతి సందర్భంగా ములుగులోని ఆమె విగ్రహానికి నేతలు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. ఎన్నో సమస్యలతో సతమతమవుతున్న ములుగు గ్రామాన్ని 2006 లో సర్పంచిగా ఎన్నికైన బాలమ్మ అన్ని రంగాల్లో గ్రామాన్ని అభివృద్ధి చేశారన్నారు. ములుగు అభివృద్ధి చరిత్రలో బాలమ్మ చేసిన సేవలు చిరస్థాయిగా నిలిచిపోతాయన్నారు. బాలమ్మ ఆశయాల సాధనకు ఆమె కుటుంబ సభ్యులు చేస్తున్న సేవలను కొనియాడారు. ప్రతి ఒక్కరూ ప్రజా ప్రతినిధిగా ఉన్నప్పుడు చేసిన అభివృద్ధి పనులే ప్రజల్లో చిరస్థాయిగా నిలిచిపోతాయన్నారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ విజయమోహన్, వైస్ చైర్మన్ ప్రభాకర్ గుప్తా, కేబీఆర్ ఫౌండేషన్ చైర్మన్ కొన్యాల బాల్ రెడ్డి, సీఐ మహేందర్ రెడ్డి, ఎస్సై విజయ్ కుమార్, తహసిల్దార్ రవీందర్ రెడ్డి, ఎంపీడీవో మేరీ స్వర్ణకుమారి, పిఎసిఎస్ వైస్ చైర్మన్ నరేష్ గౌడ్, మాజీ జెడ్పిటిసి సభ్యుడు అర్జున్ గౌడ్, కాంగ్రెస్, భారాస, భాజపా పార్టీల నాయకులు కృష్ణారెడ్డి, నరసింహారెడ్డి, శ్రీనివాస్ గౌడ్, కరుణాకర్ రెడ్డి, రాజు, నర్సింలు, శ్రీనివాస్, లక్ష్మణ్ గౌడ్, కనకయ్య, రాములు , బాలు, లక్ష్మణ్, హనుమంత రెడ్డి, కుమార్ ,నాగేష్, చందు, శ్రీరామ్, రాజు, శివ రాములు, పోచయ్య, యాదగిరి, రవి, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

## నిస్సహాయ స్థితిలో కుటుంబానికి సహాయం చేసిన టౌన్ సీఐ

**మెదక్, అక్టోబర్ 11 (ప్రజా స్వరం) :**

మెదక్ కు చెందిన ఓ కుటుంబం తిరుపతి దర్శనం కోసం వెళ్ళడం జరిగింది. అక్కడ వారి డబ్బులు, వస్తువులు ఎవరో దొంగిలించడంతో తిరిగి మెదక్ రావడానికి డబ్బులు లేక ఇబ్బందులు పడుతున్న సమయంలో రైల్వే పోలీసుల ద్వారా మెదక్ టౌన్ సీఐ మహేష్ విషయం తెలుసుకున్నారు. రైల్వే పోలీసుల సహాయం తీసుకుని ఆ కుటుంబం కి 4 వేలు పంపారు. శనివారం



ఆ కుటుంబం సురక్షితంగా మెదక్ కు చేరడం జరిగింది.

## పప్పుధాన్యాలలో ఆత్మనిర్భరత



- **ఎమ్మెల్యే రామ్మోహన్ రెడ్డి**

**పరిగి, అక్టోబర్ 11(ప్రజా స్వరం):**

పరిగి మండలం నస్కల్ గ్రామంలోని రైతు వేదికలో "పప్పుధాన్యాల్లో ఆత్మనిర్భరత'' అంశంపై నిర్వహించిన అవగాహన కార్యక్రమానికి పరిగి ఎమ్మెల్యే & డిసిసి అధ్యక్షులు డాక్టర్ టి.రామ్మోహన్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ "దేశ ఆర్థిక వ్యవస్థలో వ్యవసాయ రంగం కీలకమైన స్థానం కలిగి ఉంది. ముఖ్యంగా పప్పుధాన్యాల ఉత్పత్తిలో రైతులు ఆత్మనిర్భరులుగా మారాల్సిన అవసరం ఉంది అని అన్నారు. ప్రభుత్వం అందిస్తున్న పథకాలను సద్వినియోగం చేసుకుంటూ ఉత్పత్తి పెంపుతో పాటు మార్కెటింగ్ వ్యవస్థలో పారదర్శకతను తీసుకురావాలి," అని సూచించారు. అలాగే, పప్పుధాన్యాల పంటలకు మార్కెట్ విలువ పెరగాలంటే సమయానికి విత్తనాలు, సరైన నిల్వ సదుపాయాలు, మరియు రైతు సమూహాల మధ్య సమన్వయం అత్యంత అవసరం అని ఎమ్మెల్యే పేర్కొన్నారు. రైతులకు పంటలపై అవగాహన పెంచుకొని, వ్యవసాయ శాఖ అధికారుల సూచనలతో పంటలకు సరైన ఎరువులు మరియు మందులు వాడడం ద్వారా ఉత్పత్తిని పెంచి ఎక్కువ లాభాలు పొందవచ్చని ఎమ్మెల్యే సూచించారు. అలాగే వ్యవసాయ శాఖ అధికారులు కూడా గ్రామాల్లోకి వెళ్లి రైతులకు పండించే పంటలపై అవగాహన కార్యక్రమాలు నిరంతరంగా నిర్వహించాలని ఎమ్మెల్యే సూచించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ శాఖ అధికారులు, రైతు సమూహాల ప్రతినిధులు, మరియు స్థానిక ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

## మాజీ ఎంపీపీ కుటుంబానికి బక్కి వెంకటయ్య పరామర్శ

**దౌల్తాబాద్, అక్టోబర్ 11 (ప్రజాస్వరం) :**

దౌల్తాబాద్ మండల తాజా మాజీ ఎంపీపీ గంగాధరి సంధ్య గారి అత్తమ్మ పోచమ్మ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో శనివారం రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య, దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి కలిసి మృతురాలి కుటుంబాన్ని పరామర్శించి ఓదార్చారు. ఈ సందర్భంగా వారు కుటుంబ సభ్యులతో మాట్లాడి ధైర్యం చెప్పి సాంత్వన తెలిపారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు సయ్యద్ రహీమొద్దీన్, బీఆర్ఎస్ మండల యువజన నాయకులు నర్రా రాజేందర్, తదితర పార్టీ నాయకులు పాల్గొన్నారు.



# బెట్టింగ్, చెడు అలవాట్లకు బానిసై చోరీలు

- **నిందితులను ముగ్గురిని అరెస్ట్ చేసిన పోలీసులు**
- **జిల్లా ఎస్పీ శ్రీనివాస రావు**

**మెదక్, అక్టోబర్ 11 (ప్రజా స్వరం) :**




బెట్టింగ్, చెడు అలవాట్ల లకు బానిసలై వరుస చోరీలకు పాల్పడిన ఇద్దరిని సాంకేతిక ఆధారాల తో పట్టుకున్నట్లు జిల్లా ఎస్పీ శ్రీనివాస రావు పేర్కొన్నారు. శనివారం మెదక్ జిల్లా కేంద్రం ఆయన మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నర్సాపూర్ లో ఇటీవల నర్సాపూర్ పట్టణంలో మద్య రాత్రి ఒక కార్ లో ముగ్గురు వ్యక్తులు వచ్చి సంగారెడ్డి రోడ్ లో ఒంటరిగా స్కూటీ పై వెళ్తున్న వ్యక్తిని ఆపి, అతనిని కొట్టి 350 నగదు, పర్సు లాక్కొన్నారని అన్నారు. అదే రాత్రి గొర్రెల కాపరులు అయిన ఇద్దరు వ్యక్తులను మెదక్ రోడ్ లోని బస్ స్టాప్ వద్ద లిఫ్ట్ ఇస్తామని కారులో ఎక్కించుకొని, మార్గ మధ్యలో ఇద్దరు వ్యక్తులను చేతులతో కొట్టి చంపుతాని బెదిరించి, 2500 నగదు, ఫోన్ పే ల నుండి 5550 పంపించుకున్నారని అన్నారు. ఈ కేసులో నిందితులైన నీలగిరి దశరథ్, బుర్నోటి ఆగమయ్య, దన్నారం కృష్ణ సాంకేతిక ఆధారాలను ఉపయోగించి జగద్గిరిగుట్ట లోని ఆల్విస్ కాలనిలో అదుపులోకి తీసుకొన్నట్లు తెలిపారు. నిందితుల నుండి షిఫ్ట్ కారు, 3 మొబైల్ ఫోన్స్ స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ఈ కేసును చేదించడంలో ప్రతిభ కనబర్చిన తూప్రాన్ డీఎస్పి నరేందర్ గౌడ్, నర్సాపూర్ సీఐ జాన్ రెడ్డి, నర్సాపూర్ ఎస్ఐ రంజిత్ కుమార్, సిబ్బంది శ్రీకాంత్, ఉపేందర్, బాగయ్యలను ఎస్పీ శ్రీనివాస రావు అభినందించారు.



## దుర్గమ్మ సన్నిధిలో అన్నదానం

**దౌల్తాబాద్, అక్టోబర్ 11 (ప్రజాస్వరం):**

దౌల్తాబాద్‌లో శరణ్య నవరాత్రి ఉత్సవాలు భక్తి శ్రద్ధలతో ఘనంగా నిర్వహించబడినవి. నవరాత్రుల సందర్భంగా అమ్మవారికి తొమ్మిది రోజులపాటు ప్రత్యేక పూజలు, అలంకరణలు, నైవేద్యాలు నిర్వహించినట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని అమ్మవారికి ఒడి బియ్యాన్ని పోసి ప్రార్థనలు చేశారు. శనివారం అమ్మవారి సన్నిధిలో దుర్గమ్మ ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం ఘనంగా నిర్వహించబడింది. భక్తులు పెద్ద ఎత్తున పాల్గొని భోజన సేవలో భాగమయ్యారు. ఉత్సవాల సందర్భంగా ఆలయ పరిసరాలు భక్తి మయంగా మారి, అమ్మవారి నామస్మరణతో మార్మోగాయి.




## హ్యూమన్ రైట్స్ ఆధ్వర్యంలో అంతర్జాతీయ బాలికల దినోత్సవం

**మధురవాడ, అక్టోబర్ 11(ప్రజాస్వరం):**

జీవీఎంసీ జోన్ 2 పరిధిలో హ్యూమన్ రైట్స్ సెల్ చైర్మన్ కుప్పిలి రామకృష్ణ మరియు స్టేట్ ఎడిషనల్ సెక్రెటరీ హ్యూమన్ రైట్స్ సెల్ ఎస్ మల్లేశ్వరి ఆధ్వర్యంలో కొమ్మాది మూడుగుళ్ల జంక్షన్ వద్ద నుంచి జోన్ 2 కార్యాలయం వరకు అంతర్జాతీయ బాలికల దినోత్సవం పురస్కరించుకొని ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా మల్లేశ్వరి మాట్లాడుతూ బాలికలకు నేటి రోజులలో భద్రత కరువైందని దీనిపై ప్రభుత్వం దృష్టి సారించాలని వారికి తగిన భద్రత కల్పించాలని దానికి హ్యూమన్ రైట్ సెల్ తరఫునుంచి తాము అండగా ఉంటామని అలాగే మహిళలకు కూడా రక్షణ కరువైందని ప్రభుత్వం బాలికలు మహిళల విషయంలో భద్రత కల్పించేందుకు సరైన ప్రణాళికలు వేయాలని కోరారు. అలాగే తాము హ్యూమన్ రైట్స్ సెల్ నుంచి భవిష్యత్తులో మధురవాడ పరిసర ప్రాంతాల్లో మరిన్ని ర్యాలీలు చేపడుతామని తెలిపారు. నవంబర్ 25న అంతర్జాతీయ మహిళలపై హింస నిర్మూలనా దినోత్సవం ను పెద్ద ఎత్తున చేపట్టేందుకు సిద్ధమవుతున్నామని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కన్వీనర్లు ఎం సీతారమణి వాణిశ్రీ కే ఆదిలక్ష్మి మరియు బాలికలు మహిళలు పాల్గొన్నారు.

## నేడు తూప్రాన్ మనోహరాబాద్ మండలాలలో విద్యుత్ సరఫరాకు అంతరాయం

- **తూప్రాన్ మనోహరాబాద్ విద్యుత్తు శాఖ ఏఈలు వెంకటేశ్వర్లు, రాజ్ కుమార్**
- **తూప్రాన్ ఏడీఈ శ్రీనివాస్**

**మెదక్ జిల్లా అక్టోబర్ 11(ప్రజాస్వరం):**

నేడు తూప్రాన్ అంతటా ఉదయం 10:30 గంటల నుండి 1:30 గంటల వరకు అలాగే మనోహరాబాద్ మండలం లో నేటి ఉదయం 10:00 గంటల నుండి సాయంత్రం 04:00 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయము ఉంటుందని తూప్రాన్ మనోహరాబాద్ విద్యుత్ శాఖ ఏఈలు వెంకటేశ్వర్లు రాజ్ కుమార్, తూప్రాన్ ఏడీఈ శ్రీనివాస్ లు ఒక ప్రకటన ద్వారా తెలిపారు.కాల్లకల్ 33కేవీ పారిశ్రామిక ప్రాంత ఫీడర్ అలాగే 33కేవీ సీతారామ ఫీడర్లకు విద్యుత్ సరఫరా నిలిపివేయ బడుతుందని అలాగే ముప్పిరెడ్డిపల్లి సబ్ స్టేషన్ 33/11 కేవీ పరిధిలోని పారిశ్రామిక ప్రాంతంలో రోడ్లపై విద్యుత్ స్తంభాలు అలాగే హైటెన్షన్ వైర్లను తాకుతున్న చెట్ల కొమ్మ లు తొలగించడం జరుగుతుందనీ అలాగే సబ్స్టేషన్లలో మరమ్మత్తు పనుల కారణంగా విద్యుత్ సరఫరా నిలిచిపోతుందనీ,వినియోగదారులు సహకరించాలని తూప్రాన్ మనోహరాబాద్ టీజీపీడీసీఎల్ ఏఈఓపీలు వెంకటేశ్వర్లు రాజ్ కుమార్ తూప్రాన్ ఏడీఈ ఓపీ శ్రీనివాస్ లు మీడియా ద్వారా సూచించారు.

## గుండె పోటు తో మరణించిన బిజెపి సీనియర్ నాయకుడు.

- **పార్థిహ దేహానికి నివాళులర్పించిన మెదక్ జిల్లా బిజెపి పార్టీ అధ్యక్షులు.**

**మెదక్ జిల్లా అక్టోబర్ 11(ప్రజాస్వరం):**

మెదక్ జిల్లా పాపన్నపేట్ మండల్ పాత లింగాయపల్లి గ్రామానికి చెందిన బిజెపి సీనియర్ నాయకులు అర్జున దస్తయ్య దురదృష్టవశాత్తు గుండెపోటుతో మరణించడం జరిగింది. ఈ విషయం తెలుసుకున్న మెదక్ జిల్లా బిజెపి పార్టీ అధ్యక్షులు వాల్డాస్ రాధా మల్లేష్ గౌడ్ వారి పార్థిహ దేహానికి నివాళులర్పించి వారి కుటుంబాన్ని పరామర్శించి అధైర్య పడవద్దని పార్టీ మీ కుటుంబానికి అండగా ఉంటుందని చెప్పడం జరిగింది. వారితోపాటు మాజీ జిల్లా అధ్యక్షులు గడ్డం శ్రీనివాస్, జిల్లా కిసాన్ మోర్చా అధ్యక్షులు సత్యనారాయణ, ఓబీసీ మోర్చా జిల్లా అధ్యక్షులు గడ్డం కాశీనాథ్, జిల్లా యువ మోర్చా అధ్యక్షులు సతీష్, జిల్లా మాజీ ప్రధాన కార్యదర్శి ఎం.ఎల్.ఎన్ రెడ్డి, ఓబిసి మోర్చా జిల్లా ఉపాధ్యక్షులు గుండం శంకర్, పాపన్నపేట మండల్ అధ్యక్షులు సంతోష్ చారి, కొల్చారం మండల అధ్యక్షులు హరీష్, మెదక్ పట్టణ అధ్యక్షులు నాయిని ప్రసాద్, మండల మాజీ అధ్యక్షుడు దయాకర్,బి కొండ రాములు, ప్రధాన కార్యదర్శులు రామ్ రెడ్డి, రాజు, లక్ష్మణ్, భూషణం, శ్యామ్, బిజెవైఎం నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.



## మహిళా ప్రాణాలను కాపాడిన డయల్ 100 కాల్ సిబ్బంది.

**మెదక్ ప్రతినిధి అక్టోబర్ 11(ప్రజాస్వరం):**



మెదక్ జిల్లా హావేళ్ళి ఘణపూర్ మండలం లోని లింగసాని పల్లి జరిగిన ఘటనలో డయల్ 100 సిబ్బంది వేగవంతమైన స్పందనతో ఒక మహిళ ప్రాణాలను రక్షించాడు. జ్యోతి అనే మహిళ ఆత్మహత్య చేస్తుందనే సమాచారం అందగానే పోలిసులు వరప్రసాద్ (లడ్డు), దయానంద్, రమేష్, ఐదుని మిషాలలో ఘటన స్థలానికి చేరుకున్నారు. హోంగార్డు వరప్రసాద్ ఇంటి తలుపులు పగలగొట్టి తక్షణ సిపిఆర్ చేసి మహిళను అపస్మారక స్థితిలో నుంచి బయటకు తేవడంలో కీలక పాత్ర పోషించారు. అనంతరం జ్యోతిని మెదక్ జిల్లా ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. జిల్లా ఎస్పీ డి వి శ్రీనివాసరావు ఆదేశాల మేరకు ఎస్సై నరేష్ మెరుగైన వైద్యం అందేలా చర్యలు తీసుకున్నారు. ఈ అత్యవసర స్పందనతో మహిళా ప్రాణాలను కాపాడినందుకు జిల్లా ఎస్పీ డి.వి, శ్రీనివాసరావు హోంగార్డు వరప్రసాద్ (లడ్డు), జైయానంద్, రమేష్ లను అభినందించారు.

# ముందుకా.. వెనక్కా?
# హైకోర్టు తీర్పుపై ఈసీ మంతనాలు

**హైదరాబాద్ అక్టోబర్ 11(ప్రజాస్వరం):**



బీసీ రిజర్వేషన్లపై హైకోర్టు స్టే విధించడంతో స్థానిక ఎన్నికల నిర్వహణపై ఈసీ ఆలోచిస్తుంది. పాత రిజర్వేషన్ల ప్రకారం ఎన్నికలు నిర్వహించాలా.. ప్రభుత్వ నిర్ణయం కోసం వేచి ఉండాలా అని న్యాయనిపుణులతో చర్చిస్తోంది. స్థానిక సంస్థల ఎన్నికల అంశం ఇప్పుడు రాష్ట్రంలో హాట్ టాపిక్‌గా మారింది. హైకోర్టు తాజా తీర్పు రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశమైంది. 42 శాతం బీసీ రిజర్వేషన్ల జీవోపై స్టే విధించిన న్యాయస్థానం.. ఎన్నికల ప్రక్రియలో జోక్యం చేసుకోవడం లేదని స్పష్టం చేసింది. పాత రిజర్వేషన్ల ప్రకారం ఎన్నికలు నిర్వహించుకునేందుకు ఎలాంటి అభ్యంతరం లేదని తేల్చి చెప్పింది. తద్వారా ఎన్నికల అంశాన్ని అటు ప్రభుత్వం, ఇటు ఎన్నికల సంఘంపైకి నెట్టేసింది. హైకోర్టు ఉత్తర్వుల నేపథ్యంలో ప్రభుత్వం, ఈసీ తదుపరి ఎలాంటి చర్యలు తీసుకుంటాయన్న దానిపైనే అందరి దృష్టి నెలకొంది.

**జోక్యం చేసుకోలేదన్న కోర్టు..**

స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ ప్రభుత్వం ఇటీవల జీవో నెం.9 జారీ చేసిన సంగతి తెలిసిందే. అయితే, రిజర్వేషన్లు 50 శాతానికి మించొద్దన్న సుప్రీం కోర్టు ఆదేశాల నేపథ్యంలో జీవో చట్టబద్ధతను సవాలు చేస్తూ హైకోర్టులో పిటిషన్లు దాఖలయ్యాయి. దీనిపై సుదీర్ఘ విచారణ జరిపిన న్యాయస్థానం.. జీవో నెం.9పై స్టే విధించింది. అదే సమయంలో బీసీ రిజర్వేషన్లను పెంచకుండా పాత విధానంలో ఎన్నికలు నిర్వహించేందుకు ఎలాంటి అడ్డంకులు లేవని ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అపరేశ్ కుమార్ సింగ్, జస్టిస్ గౌస్ మీరా మోహియొద్దీన్‌తో కూడిన ద్విసభ్య ధర్మాసనం ఉత్తర్వులు జారీ చేసింది. బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల అమలును మాత్రమే నిలిపివేస్తున్నట్టు, ఎన్నికల నోటిఫికేషన్ అమలును నిలిపివేయలేదని ఉత్తర్వుల్లో స్పష్టం చేసింది. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు ఇవ్వకుండా పాత విధానంలో ఎన్నికలు నిర్వహించవచ్చునని పేర్కొన్నది. ఎన్నికల నోటిఫికేషన్ ప్రకారం పాత విధానంలో అంటే బీసీలకు 25 శాతం, ఎస్సీలకు 15, ఎస్టీలకు 10 శాతం చొప్పున కేటాయిస్తూ ఎన్నికలు నిర్వహించవచ్చునని స్పష్టంచేసింది. పాత పద్ధతిలో సీట్ల రిజర్వేషన్ల ప్రక్రియను సవరించి ఆమేరకు సీట్లు, రిజర్వేషన్లు ప్రకటించి ఎన్నికల ప్రక్రియ కొనసాగించవచ్చని చెప్పింది.

**న్యాయ నిపుణులతో ఈసీ చర్చలు**

స్థానిక సంస్థల ఎన్నికలపై రాష్ట్ర ఎన్నికల సంఘం తాజాగా దృష్టి సారించింది. జీవో నెం.9 41పై హైకోర్టు స్టే విధించిన నేపథ్యంలో ఎన్నికల ప్రక్రియను నిలిపివేస్తున్నట్లు ఈసీ రెండ్రోజుల క్రితం ప్రకటన విడుదల చేసింది. అయితే, తాజాగా హైకోర్టు ఉత్తర్వులు బయటకు రావడంతో ఈసీ పునరాలోచనలో పడింది. పాత రిజర్వేషన్ల ప్రకారం ఎన్నికలు నిర్వహించుకోవచ్చని హైకోర్టు ఉత్తర్వులు జారీ చేసిన నేపథ్యంలో తదుపరి చర్యలపై రాష్ట్ర ఎన్నికల సంఘం దృష్టి సారించింది. ఈ మేరకు శనివారం న్యాయ నిపుణులతో సమావేశమైంది. హైకోర్టు ఉత్తర్వులపై న్యాయ నిపుణులతో సుదీర్ఘంగా చర్చలు జరిపింది. న్యాయస్థానం ఆదేశాల మేరకు తదుపరి ఎన్నికలు వెళ్లాలా.. లేదా ? అన్న అంశంపై చర్చించింది. మరోవైపు, పాత రిజర్వేషన్ల ప్రకారం ఎన్నికలు నిర్వహించేందుకు ప్రభుత్వ అభిప్రాయాన్ని కోరాలని యోచిస్తున్న ఈసీ.. ఈమేరకు సర్కారుకు లేఖ రాయాలని భావిస్తోంది.

**ప్రభుత్వ నిర్ణయంపైనే ఆధారం..**

స్థానిక సంస్థల ఎన్నికల్లో జోక్యం చేసుకోలేదని హైకోర్టు స్పష్టం చేసిన నేపథ్యంలో.. ఇప్పుడు అందరి దృష్టి ప్రభుత్వంపైనే నెలకొంది. పాత రిజర్వేషన్ల ప్రకారం ఎన్నికల నిర్వహణపై ముందుకెళ్తారా.. లేక ఇచ్చిన మాట మేరకు 42 శాతం రిజర్వేషన్లు సాధ్యమయ్యే వరకూ వాయిదా వేస్తారా? అన్నది సందిగ్ధంగా మారింది. ప్రభుత్వం తీసుకునే నిర్ణయం ఆధారంగానే ఈసీ ముందుకెళ్లనుంది. ఈ నేపథ్యంలో సర్కారు ఎలాంటి నిర్ణయం తీసుకుంటుందన్న దానిపై తీవ్ర ఉత్కంఠ నెలకొంది. బీసీలకు ఇచ్చిన మాట ప్రకారం 42 శాతం రిజర్వేషన్లు ఇచ్చాకే ఎన్నికలకు వెళ్లాలని రేవంత్ సర్కారు పట్టుదలతో ఉంది. అందుకే హైకోర్టు స్టే విధించడాన్ని సవాలు చేస్తూ సుప్రీంకోర్టుకు వెళ్లాలని యోచిస్తోంది. ఈ వ్యవహారంపై చర్చించేందుకు ఈ నెల 16న మంత్రిమండలి సమావేశం నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయించింది. కేబినెట్ భేటీలో చర్చించి తదుపరి నిర్ణయం తీసుకోనుంది.

## నష్టపోయిన పత్తి రైతులను ప్రభుత్వం ఆదుకోవాలి వంటేరు ప్రతాప్ రెడ్డి

- **పంట నష్టపోయినా రైతుల సర్వే చేసి నష్టపరిహారం అందించాలి**
- **అకాల వర్షాలకు నష్టపోయినా రైతులకు వెంటనే రూ. 25,000 వేలు చెల్లించాలి**

**జగదేవపూర్ అక్టోబర్ 11(ప్రజాస్వరం):**

అకాల వర్షాల వల్ల నష్టపోయిన పత్తి రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని తెలంగాణ రాష్ట్ర మాజీ ఎఫ్ డీ సి చైర్మన్, బిఆర్ఎస్ పార్టీ గజ్వేల్ నియోజకవర్గం ఇంచార్జి వంటేరు ప్రతాప్ రెడ్డి డిమాండ్ చేశారు. శనివారం మండలంలోని అలీరాజ్ రాపేట గ్రామంలో దెబ్బతిన్న పత్తి పంటలను మండల నాయకులతో కలిసి ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈసంవత్సరం అధిక వర్షాల కారణంగా తెలంగాణలో అనేక ప్రాంతాల్లో, ముఖ్యంగా సిద్దిపేట జిల్లా లోనీ జగదేవపూర్ మండలంలో పత్తి పంటలు తీవ్రంగా దెబ్బతిన్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. రైతు వజ్రరోజు వెంకట్ చారి పెట్టుబడులు పెట్టి పంట చేతికొచ్చే సమయానికి అధిక వర్షాల వల్ల రైతులు తీవ్రంగా నష్టపోయినట్లు తెలిపారు. సాధారణంగా ఎకరాకు 15 క్వింటాళ్ల దిగుబడి రావాల్సి ఉండగా, ఇప్పుడు కేవలం ఒకటి లేదా రెండు క్వింటాళ్లకు మించి వచ్చే పరిస్థితి లేదన్నారు. వర్షాల వల్ల పత్తి చెట్లు ఏపుగా పెరిగినా, కాయలు కుళ్లిపోవడంతో రైతులు అయోమయ స్థితిలో ఉన్నట్లు తెలిపారు. నష్టపోయిన రైతులకు నష్టపరిహారం కింద రూ.25000 వేల రూపాయల వెంటనే రాష్ట్ర ప్రభుత్వం నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. మండలంలో సి సి పత్తి కొనుగోలు కేంద్రాలు ప్రారంభించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు, ఈ కార్యక్రమంలో వారి వెంట మండల మాజీ ఎంపీపీ బాలేశం గౌడ్, పిఎసిఎస్ చైర్మన్ ఇంద్రసేనారెడ్డి, టిఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు శ్రీనివాస్ గౌడ్,మండల మాజీ కో అప్షన్ సభ్యులు సయ్యద్ ఇక్బాల్ మాజీ ఎంపీటీసీల ఫోరం జిల్లా అధ్యక్షులు కిరణ్ గౌడ్, మాజీ ఎంపీటీసీ కొత్త కవిత శ్రీనివాస్ రెడ్డి మాజీ సర్పంచ్ చంద్రశేఖర్ గుప్తా,యాదవ రెడ్డి పిఎసిఎస్ డైరెక్టర్ భూమయ్య, జగదేవపూర్ గ్రామ టిఆర్ఎస్ పార్టీ యూత్ అధ్యక్షులు గణేష్,మండల నాయకులు కొంపల్లి శ్రీనివాస్ చెక్కల నరేష్ అలిమ్, వంశి గౌడ్ మహేష్ నిర్మల్ నగర్ బీ ఆర్ యస్ పార్టీ అధ్యక్షులు కర్రె యాదగిరి భాస్కర్, వెంకట చారి, సురేష్ చారి రాంచంద్రా రెడ్డి శ్రీనివాస్ రెడ్డి బాపు రెడ్డి బాల్ రెడ్డి పండుగ వెంకట్ రైతులు తదితరులు పాల్గొన్నారు.





## మెదక్ ఎంపీ రఘునందన్ రావు పై అనుచిత వ్యాఖ్యలు చేసిన వారిని తక్షణమే శిక్షించాలి.

- **మెదక్ జిల్లా బిజెపి నాయకుల డిమాండ్**

**మెదక్ జిల్లా ప్రతినిధి అక్టోబర్ 11(ప్రజాస్వరం):**



మెదక్ జిల్లా పాపన్నపేట్ మండలంలో ఈనెల 5వ తేదీన నగ్సన్ పల్లి శ్రీ ఏడుపాయల వన దుర్గ ఆలయం వద్ద ఇద్దరు వ్యాపారస్తులకు వాగ్వాదం జరిగి గొడవ కావడంతో అందులో ఒకరు మృతి చెందడం జరిగింది. ఈ సంఘటన కోసం హైదరాబాద్ నుండి చనిపోయిన వ్యక్తిని పరామర్శించడానికి ఒక ముస్కులో వచ్చిన ఒక ఎంఐఎం కు సంబంధించిన హంసదుల్లా ఖాన్ అనే వ్యక్తి ఇక్కడికి వచ్చి వారి కుటుంబాలను పరామర్శించకుండా రాజకీయ కోణంలో కాంగ్రెస్ ఎమ్మెల్యేకు వత్తాసు పలుకుతూ మెదక్ పార్లమెంట్ సభ్యులు మాధవనేని రఘునందన్ రావు గారిని కించపరుస్తూ అనుచిత వ్యాఖ్యలు చేసినందుకు వాడికి తగిన శిక్ష పడేలా చూడాలని పాపన్నపేట్ మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్లో హంసదుల్లా ఖాన్ పై పోలీస్ అధికారులకు ఫిర్యాదు చేసిన మెదక్ జిల్లా బిజెపి పార్టీ అధ్యక్షులు వాల్డాస్ రాధా మల్లేష్ గౌడ్, ఈ కార్యక్రమంలో మాజీ జిల్లా అధ్యక్షులు గడ్డం శ్రీనివాస్, జిల్లా ప్రధాన కార్యదర్శి సంఘసాని సురేష్,రంజిత్ రెడ్డి, జిల్లా ఉపాధ్యక్షులు రాజేందర్, జిల్లా కిసాన్ మోర్చా అధ్యక్షులు సత్యనారాయణ, ఓబీసీ మోర్చా జిల్లా అధ్యక్షులు గడ్డం కాశీనాథ్, జిల్లా యువ మోర్చా అధ్యక్షులు సతీష్, జిల్లా మాజీ ప్రధాన కార్యదర్శి ఎంఎల్ఎన్ రెడ్డి, జిల్లా కార్యదర్శి అశోక్, సాదుల, జిల్లా కోశాధికారి ఆంజనేయులు గౌడ్, ఓబిసి మోర్చా జిల్లా ఉపాధ్యక్షులు గుండం శంకర్, పాపన్నపేట మండల్ అధ్యక్షులు సంతోష్ చారి, కొల్చారం మండల అధ్యక్షులు హరీష్,మెదక్ పట్టణ అధ్యక్షులు నాయిని ప్రసాద్, మండల మాజీ అధ్యక్షుడు దయాకర్, బి కొండ రాములు, ప్రధాన కార్యదర్శులు రామ్ రెడ్డి, రాజు, లక్ష్మణ్ భూషణం, శ్యామ్, బిజెవైఎం. రాహుల్ బుల్లెట్ సాయి కుమార్, సన్నీ, సాయికిరణ్, జగదీష్, తదితరులు పాల్గొన్నారు.




## సొంత అన్ననే.. నా భూమి కబ్జా చేసిండు


- **వాల్ పోస్టర్లు వేసి, కరపత్రాలు వంచి నిరసన**
- **సోదరుడి చర్యలపై మహిళ పోరాటం**
- **సిద్దిపేట జిల్లాలో విరలాపూర్ లో వింత ఘటన**

**ప్రజాస్వరం, సిద్దిపేట ప్రతినిధి**

రక్తం పంచుకుని పుట్టిన అన్ననే తన భూమిని ఆక్రమించుకుని, అతడి కుమారుడి పేరిట రిజిస్ట్రేషన్ చేసుకున్నాడని ఆరోపి స్తూ ఓ మహిళ వాల్ పోస్టర్లు వేసి, కర పత్రాలు సం చి వినూత్న నిరసనకు దిగింది. ఈ ఘటన సిద్దిపేట జిల్లా చిన్నకోడూరు మండలం విరలాపూర్లో చోటుచేసుకుంది. మెకిల్లి కనకవ్వ అలియాస్ పుచ్చ కాయల కనకవ్వ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. పుచ్చకాయల వెంకట రెడ్డికి ముగ్గరు కొడుకులు రాంరెడ్డి, నారాయణరెడ్డి, ఓజిరెడ్డి, కూతురు మెకిల్లికనకవ్వ అలియాస్ పుచ్చకాయల కనకవ్వ ఉన్నారు. వెంకట రెడ్డి తన ఆస్తి ముగ్గురు కుమారులకు సమానంగా పంచాడు. సర్వే నెంబర్ 270 లో గల 3,03ఎకరాల భూమిని బిడ్డకు ఇవ్వాలని తల్లి దండ్రు లు సూచించారు. వారు చనిపోయాక ఆ భూమిని తన కొడుకు పేర ఓజిరెడ్డి రిజిస్ట్రేషన్ చేయించాడు. తనకు చెందిన భూమిని తనకే రిజిస్ట్రేషన్ చేసి ఇవ్వాలని కోరితే బెదిరింపులకు గురిచేస్తున్నట్లు కనకవ్వ ఆవేదన వ్యక్తం చేశారు. భూ కబ్జానే కాకుండా తన వద్ద 10 తులాల బంగారం కూడా తీసుకున్నాడని ఆరోపించారు. గ్రామస్తులు తనకు న్యాయం చేయాలని కోరారు. ఈ వివరాలతో కూడిన పోస్టర్లను గ్రామంలో పలు చోట్ల అతికిం చారు. కరపత్రాలను ఇంటింటికి పంచుతున్నారు..

ప్రజాస్వరం PRAJASWARAM తెలుగు దినపత్రిక
12.10.2025
ఆదివారం | హైదరాబాద్
www.prajaswaramdaily.com


## ఆ హీరో 8 గంటలే పనిచేస్తాడు



ఎన్నో రంగాల్లో చర్చనీయాంశంగా మారిన వర్కింగ్ అవర్స్ అంశం ప్రస్తుతం సినీ ఇండస్ట్రీలో కూడా హాట్ టాపిక్‌గా మారిన విషయం తెలిసిందే. అగ్ర కథానాయిక దీపిక పదుకొణె వర్కింగ్ అవర్స్ కారణంగానే పెద్ద ప్రాజెక్ట్‌లు వదులుకుందన్న వార్తలు సోషల్ మీడియాలో షేర్ అవుతున్నాయి. తాజాగా ఆమె ఈ అంశంపై స్పందిస్తూ.. ఇండస్ట్రీలో కొందరు స్టార్ హీరోలు రోజులో 8 గంటలు మాత్రమే పని చేస్తారని చెప్పడంతో మరోసారి ఈ అంశం తెర పైకి వచ్చింది. ఈ నేపథ్యంలో గతంలో అభిషేక్ బచ్చన్ ఓ హీరోను ఉద్దేశిస్తూ చేసిన వ్యాఖ్యలు  షేర్ అవుతున్నాయి.

బాలీవుడ్‌లో ఎంతో ప్రాముఖ్యం సొంతం చేసుకున్న కార్యక్రమం 'ది కపిల్ శర్మ షో'. గతంలో ఈ కార్యక్రమంలో అభిషేక్ బచ్చన్, అక్షయ్ కుమార్‌పాల్గొని సందడి చేశారు. అందులో అక్షయ్‌కుమార్ గురించి అభిషేక్ మాట్లాడుతూ.. ''అక్షయ్‌కు ఉత్సాహం ఎక్కువ. అందుకే 8 గంటలు దాటితే ఒక్క నిమిషం కూడా సెట్‌లో ఉండడు. సెట్ నుంచి బయటకు రాగానే మేకప్, కాస్ట్యూమ్స్ అన్నీ తీసేస్తాడు. ఒకవేళ షెడ్యూల్ ఉదయం ఏడు గంటలకు ప్రారంభమవుతుందంటే.. కచ్చితంగా ఆ సమయానికి సెట్‌లో ఉంటాడు'' అని చెప్పారు. దీంతో దీపిక చెప్పిన స్టార్ హీరో ఆయనేనా అని నెటిజన్లు చర్చించుకుంటున్నారు.

గత కొన్ని రోజులుగా సోషల్ మీడియాలో తనపై వస్తోన్న వార్తలపై తాజాగా దీపిక స్పందించిన విషయం తెలిసిందే. భారతీయ చిత్ర పరిశ్రమలో చాలామంది అగ్రహీరోలు ఎన్నో ఏళ్లుగా 8 గంటలు మాత్రమే పనిచేస్తున్నారని ఆమె తెలిపారు. ఇదేం రహస్యం కాదన్నారు. కానీ, ఇన్నేళ్లలో ఈ విషయం ఎప్పుడూ వార్తల్లో నిలవలేదని ఇప్పుడు తాను అడిగినప్పుడు మాత్రమే ఇలా హైలైట్ చేస్తున్నారని అసహనం వ్యక్తంచేశారు.

## హనీమూన్ షెడ్యూల్ కూడా చెప్పేయండి



తమిళ, తెలుగు భాషల్లో స్టార్ హీరోయిన్‌గా తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్నారు నటి త్రిష. కెరీర్ మొదలు పెట్టి ఏళ్లు గడుస్తున్నా, ఇంకా కథానాయికగా వరుస అవకాశాలు అందుకుంటున్నారు. ఇండస్ట్రీలో వివాహం కాని హీరోయిన్‌ల జాబితాలో ఆమె ఒకరు. దీంతో త్రిష పెళ్లి ఎప్పుడూ హాట్ టాపికే. ఈ క్రమంలో మరోసారి ఆమె పెళ్లి వార్తలు సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి. చండీగఢ్‌కు చెందిన వ్యాపారవేత్తను పెళ్లి చేసుకోబోతున్నారంటూ వార్తలు వచ్చాయి. ఈ క్రమంలో త్రిష కాస్త ఘాటుగానే స్పందించారు. ఇన్‌స్టా స్టోరీస్‌లో పోస్ట్ పెట్టారు.

"నాకోసం నా జీవితాన్ని ప్లాన్ చేస్తున్న వాళ్లను నేను ప్రేమిస్తా. హనీమూన్ షెడ్యూల్ కూడా చెబుతారేమోనని వేచి చూస్తున్నా'' అంటూ వ్యంగ్యంగా పేర్కొన్నారు. దీంతో ఆమె పెళ్లి చేసుకోవట్లేదని చెప్పకనే చెప్పారు. 2015లో త్రిషకు వ్యాపారవేత్త వరుణ్ మణియన్‌తో నిశ్చితార్థం జరిగింది. అయితే, అది పెళ్లివరకూ వెళ్లలేదు. కొన్ని కారణాల వల్ల ఇరువురు ఆ నిశ్చితార్థాన్ని రద్దు చేసుకున్నారు. ఆ తర్వాత మళ్లీ కెరీర్‌పై దృష్టి పెట్టిన త్రిష వరుసగా సినిమాలు చేస్తూ వచ్చారు. ఈ ఏడాది  ఐడెంటిటీ, విదాయుమురిచ్చి, గుడ్ బ్యాడ్ అగ్లీ, థగ్‌లైఫ్ వంటి చిత్రాల్లో కనిపించారు. ప్రస్తుతం ఆమె 'కరుప్పు', 'విశ్వంభర' చిత్రాలు చేస్తున్నారు.

## సిద్ధు అలా చేస్తాడని ఊహించలేదు.



యంగ్ హీరోయిన్ రాశీ ఖన్నా 'తెలుసు కదా'సినిమాతో ప్రేక్షకుల ముందుకు రాబోతుంది. సిద్ధు జొన్నలగడ్డ, శ్రీనిధి శెట్టి ప్రధాన పాత్రలో నటించారు. ప్రముఖ కాస్ట్యూమ్ డిజైనర్ నీరజ కోన దర్శకురాలిగా పరిచయం అవుతున్న ఈ సినిమా దీపావళి కానుకగా అక్టోబర్ 17న థియేటర్స్‌లోకి రాబోతుంది. ఈ నేపథ్యంలో.. తాజాగా, ప్రమోషన్స్ జోరు పెంచిన రాశీఖన్నా ఓ ఇంటర్వ్యూలో పాల్గొని ఆసక్తికర కామెంట్స్ చేసింది. ''సిద్ధు జొన్నలగడ్డ గురించి అందరూ అనుకున్నట్లే నేను కూడా చాలా సరదాగా ఉంటాడని అనుకున్నాను. కానీ 'తెలుసు కదా' సెట్స్‌లో అతన్ని చూసి నేను నిజంగా షాక్ అయ్యాను. షూటింగ్‌లో చాలా సీరియస్‌గా ఉండేవాడు. ఫ్రేమ్ సెట్ చేయగానే మళ్లీ వెంటనే పాత్రలోకి పూర్తిగా లీనమై పోయేవాడు. సిద్ధు తన పనిని, నటనకు చాలా గౌరవిస్తాడు. అందుకే పని విషయంలో అతను అంత సీరియస్‌గా ఉంటాడు. నేను అలా చేస్తాడని ఊహించలేదు'' అని చెప్పుకొచ్చింది. ప్రస్తుతం ఈ కామెంట్స్ గురించి తెలుసుకున్న వారు కూడా ఆశ్చర్యపోతున్నారు.

## రౌడీ జనార్దన్ గా విజయ్ దేవరకొండ..

వరుస సినిమాలతో అలరించేందుకు సిద్ధమవుతున్నారు విజయ్ దేవరకొండ. నేడు ఈ హీరో మరో చిత్రం ప్రారంభమైంది. 'రౌడీ జనార్దన్' పేరుతో ఇది రానుంది. రవి కిరణ్ కోలా దర్శకత్వం వహించనున్న ఈ సినిమాలో విజయ్ సరసన కీర్తి సురేశ్ నటిస్తున్నారు. నేడు పూజా కార్యక్రమాలతో ఈ సినిమా ప్రారంభమైంది. దీనికి సంబంధించిన ఫొటోలు నెట్టింట షేర్ అవుతున్నాయి. ఈ కార్యక్రమానికి నిర్మాతలు దిల్ రాజు, అల్లు అరవింద్ హాజరయ్యారు. 'రాజావారు రాణిగారు' సినిమాతో తెలుగు ప్రేక్షకులను మెప్పించిన దర్శకుడే రవికిరణ్ కోలా. తొలి మూవీకి భిన్నంగా ఈసారి విజయ్‌తో యాక్షన్‌కు ప్రాధాన్యం ఉన్న కథను తెరకెక్కించనున్నారు. ఈనెల 16 నుంచి ముంబయిలో ఈ మూవీ రెగ్యులర్ షూటింగ్ ప్రారంభం కానుంది. మొదటిసారి విజయ్ సరసన కీర్తి సురేశ్ కనిపించనుండడంతో దీనిపై ఆసక్తి ఏర్పడింది.



EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY PURAM MAHESHWAR PRINTED AT HARI HARA ART PRINTERS, H.NO. 6-185, TOOPRAN, DIST. MEDAK, TELANGANA-502336. AND PUBLISHED AT H.NO. 4-50/18, KALLAKAL, VILL-KALLAKAL,(PO), KALLAKAL, (M) MANOHARABAD, DIST, MEDAK, TELANGANA-502336,
EDITOR : PURAM MAHESHWAR. RNI NO : TELTEL/2006/17154, CELL : 8008609999